ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 16, మే 2025


వీరయ్య చౌదరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి లోకేష్


అసలు నిందితులను శిక్షించాలని మంత్రి లోకేష్‌కు వేడుకుంటున్న మహిళలు


వీరయ్య చౌదరి భార్య సుచిత్ర, కుమారుడు చంద్ర సిద్ధార్థలతో మాట్లాడుతున్న లోకేష్

# హంతకులను కఠినంగా శిక్షిస్తాం

- వీరయ్య చౌదరి కుటుంబానికి అండగా నేనున్నా
- అమ్మనబ్రోలులో మంత్రి లోకేష్

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'వీరయ్య చౌదరిని హత్య చేసినవారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. వారిని కఠినంగా శిక్షిస్తాం. వీరయ్య కుటుంబానికి నేను అండగా ఉంటాను' అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో దారుణ హత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబసభ్యులను అమ్మనబ్రోలులోని ఆయన స్వగృహంలో మంత్రి లోకేష్ పరామర్శించారు. తొలుత వీరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వీరయ్య సతీమణి సుచిత్ర, తనయుడు చంద్ర సిద్ధార్థలను లోకేష్ ఓదార్చి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వీరయ్య అన్నారు. యువగళం పాదయాత్రలో వంద రోజుల పాటు వెన్నంటే ఉండి తనతో అడుగులు వేశారని గుర్తు చేసుకొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకొన్న వీరయ్య రాజకీయంగా ఎదుగుతున్న సమయంలో హత్యకు గురి కావడం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు.

వీరయ్య హత్య కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసి నిందితులు ఎంతటి వారైనా, ఎక్కడున్నా పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ వీరయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ మంత్రి బాచిన చెంచు గరటయ్య ఉన్నారు.

**అసలైన నిందితులను శిక్షించాలని నినాదాలు**

ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం ఉదయం మంత్రి లోకేష్ రాగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు, వీరయ్య అభిమానులు, మహిళలు పెద్దఎత్తున అక్కడికి చేరుకొన్నారు. ఓ దశలో మంత్రి వద్దకు దూసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. వీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం తన కాన్వాయ్ వద్దకు మంత్రి లోకేష్ వెళుతుండగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, అక్కడికి చేరుకొన్న మహిళలు 'హత్య కేసులో అసలైన నిందితులను వదిలేస్తున్నారు, వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలి' అని మొర పెట్టుకొన్నారు. హత్య కేసు దర్యాప్తు పూర్తి కాలేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులందరినీ పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని మంత్రి లోకేష్ వారికి హామీ ఇచ్చారు. తాను ఈ కేసులో వీరయ్య కుటుంబానికి తగిన న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. అమ్మనబ్రోలులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తుగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు.

# షరా.. మామూలే!

## సర్టిఫికెట్లు ఇవ్వడంలోనూ పైసలు పిండుతున్న అధికారులు
## కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారుల అవస్థలు

ఒంగోలులోని చెన్నకేశవ స్వామిపేటకు చెందిన ఓ చిరు వ్యాపారికి రెండేళ్ల క్రితం వివాహమైంది. తల్లిదండ్రుల నుంచి వేరుపడి భార్యా పిల్లలతో కలిసి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సచివాలయ సిబ్బంది మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని చెప్పడంతో ఆయన బుధవారం రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్లాడు. అక్కడ సిబ్బంది సర్టిఫికెట్‌కు రూ. 4వేలు డిమాండ్ చేయడంతో అవాక్కయ్యాడు.

నాలుగు రోజులుగా వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో ఒంగోలులోని జీజీహెచ్ కిక్కిరిసిపోతోంది. దంత పరీక్షలు చేయించుకుని వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్ కోసం రావడంతో ఆసుపత్రిలోని డెంటల్ డాక్టర్ వారితో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు అని అడిగారు. యర్రగొండపాలెం, మార్కాపురం, కంభం ప్రాంతాల నుంచి వచ్చామని చెప్పారు. 'అక్కడ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ వైద్యులు సర్టిఫికెట్‌లు ఇస్తారు కదా? ఇంత దూరం ఎందుకు వచ్చారు' అని వైద్యుడు అడిగారు. 'మా ఏరియాలో డాక్టర్‌లు మేము ఇవ్వకూడదు. ఒంగోలు వెళ్లి తీసుకోవాలి అని చెప్పడంతో ఇక్కడికి వచ్చాం సార్' అని బదులిచ్చారు.

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్టుంది' కొత్త రేషన్ కార్డు దరఖాస్తుదారుల దుస్థితి. పేద కుటుంబాలకు కొండంత అండ రేషన్ కార్డు. సంక్షేమ పథకాలు పొందాలన్నా ఇదే గీటురాయి. నూతన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు కూడా కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. దరఖాస్తుతో జత చేయాల్సిన పత్రాలు సేకరించడం మాత్రం లబ్ధిదారులకు సముద్రం ఈదినంత పని అవుతోంది. కీలకమైన మ్యారేజ్ సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు పొందడం అర్హులకు తలకు మించిన భారం అవుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారు. నిరక్షరాస్యుల వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం ప్రభుత్వ ఆసుపత్రికెళితే దంత వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో బిక్కమొహం వేస్తున్నారు.


ఒంగోలులోని జీజీహెచ్‌లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు



- వయస్సు ధ్రువీకరణ పత్రం పొందాలన్నా తిప్పలే
- ప్రభుత్వ వైద్యశాలల్లో నిరక్షరాస్యులకు సర్టిఫికెట్ ఇవ్వని వైద్యులు
- ఒంగోలు జీజీహెచ్‌కు పరుగులు తీస్తున్న లబ్ధిదారులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈనెల 8 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. అయితే అందుకు అర్హత ప్రమాణాలు, అవసరమైన డాక్యుమెంట్‌లు సమర్పించాలని పేర్కొంది. అర్జీదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.2 లక్షలలోపు ఉండటంతోపాటు, ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలని స్పష్టం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో నమోదు కావడంతోపాటు, కుటుంబ సభ్యుల్లో ఎవరికీ రైస్ కార్డు ఉండకూడదని పేర్కొంది. ఆధార్ కార్డు, వివాహ ధ్రువీకరణకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్, పెండ్లి ఫొటోలు తప్పనిసరి చేసింది. నిరక్షరాసులకు వయస్సు ధ్రువీకరణ పత్రం తీవ్ర సమస్యగా మారింది. అర్జీదారులు ఆయా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

**వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలుకు..**

చదువుకున్న వారికి విద్యార్హత సర్టిఫికెట్‌లలో నమోదు అయ్యే డేట్ ఆఫ్ బర్త్ సరిపోతుండగా, నిరక్షరాస్యులకు డెంటల్ డాక్టర్లు నిర్ధారించాల్సి ఉంది. దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యులు జ్ఞానదంతాలను పరీక్షించి, వాటి ఆధారంగా, మేజర్, మైనర్‌గా వయస్సును నిర్ధారిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ డాక్టర్లు సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడంతో జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులు వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలులోని జీజీహెచ్‌కు బారులు తీరుతున్నారు. జిల్లాలోని పశ్చిమప్రాంతం మార్కాపురం, వై.పాలెం, పెదారవీడు, కంభం, గిద్దలూరు, బేస్తవారపేట వంటి దూరప్రాంతాల నుంచి జీజీహెచ్‌కు వస్తున్నారు. దీంతో ఇక్కడి వైద్యులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా పొందవచ్చని, ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని వివరిస్తున్నారు. అయితే జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో అర్జీదారులు నానాఅగచాట్లు పడుతున్నారు.

**మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.4వేలు వసూలు**

వివాహమై ఇంతవరకు రేషన్ కార్డు లేనివారు కొత్త రేషన్ కార్డు పొందాలంటే కచ్చితంగా మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అర్జీదారులు పరుగులు పెడుతున్నారు. సాధారణ రోజుల్లోనే పలు భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌ల విషయంలో రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే అవినీతికి కేరాఫ్‌గా అందరు భావిస్తారు. తాజాగా మ్యారేజ్ సర్టిఫికెట్‌ల మంజూరు అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులకు మరింతగా కలిసొచ్చింది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డు పొందాలంటే అందుకు అవసరమయ్యే పత్రాలకు వేలకు వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

# టీచర్ల బదిలీలకు 5,666 ఖాళీలు

## 5వేల మందికిపైనే స్థానచలనం

ఒంగోలు విద్య, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జరగనున్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలకు మొత్తం 5,666 ఖాళీలను చూపించనున్నారు. జిల్లాలో పనిచేస్తున్న టీచర్లలో సగం మందికి స్థానచలనం కలగనుంది. జిల్లాలో మెగా డీఎస్సీకి 629 పోస్టులు ప్రకటించారు. ఈ పోస్టులు మినహా మిగిలిన 5,036 టీచర్ పోస్టులు ఉద్యోగోన్నతులు, బదిలీల ద్వారా భర్తీ కానున్నాయి. టీచర్ల బదిలీలకు ఏ పోస్టులూ బ్లాక్ చేయరు. మొత్తం అన్ని ఖాళీలను బదిలీలకు ప్రకటిస్తారు. టీచర్లు కోరుకోగా మిగిలిన స్థానాలను ఉద్యోగోన్నతులు ఇచ్చి భర్తీ చేస్తారు. బదిలీల్లో పదోన్నతుల ప్రక్రియ ముగియగా మిగిలిన ఖాళీలను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. మిగులు టీచర్లను కూడా సర్దుబాటు చేస్తారు.

**సబ్జెక్టులవారీగా టీచర్లు, హెచ్‌ఎంల ఖాళీల వివరాలు**

| | |
|---|---|
| గ్రేడ్-2 హెచ్‌ఎం (హైస్కూలు) | : 109 |
| ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం | : 609 |
| స్కూలు అసిస్టెంట్ తెలుగు | : 155 |
| స్కూలు అసిస్టెంట్ హిందీ | : 207 |
| స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు | : 239 |
| స్కూలు అసిస్టెంట్ గణితం | : 319 |
| స్కూలు అసిస్టెంట్ పీఎస్ | : 376 |
| స్కూలు అసిస్టెంట్ బీఎస్ | : 238 |
| స్కూలు అసిస్టెంట్ సోషల్ | : 206 |
| స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య | : 225 |
| స్కూలు అసిస్టెంట్ సంస్కృతం | : 03 |
| స్కూలు అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ | : 04 |
| ఎస్జీటీ (తెలుగు) | : 2948 |
| ఎస్జీటీ ఉర్దు | : 11 |
| మొత్తం | : 5666 |

జిల్లాలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాలు, మే 31 నాటికి ఉద్యోగ విరమణ చేయనున్న ఖాళీలు 5/8 సంవత్సరాలు పూర్తయిన హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, ఎస్జీటీలు, ఇతర టీచర్లు, టీచర్ల పునర్విభజనలో పాఠశాలలకు కొత్తగా కేటాయించిన పోస్టులు మొత్తం 5,666 ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నాయి. మొత్తం ఖాళీల్లో సగానికిపైగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులున్నాయి. మొత్తం ఖాళీల్లో 5/8 సంవత్సరాలు పూర్తయి తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు 2,372 మంది, టీచర్ల పునర్విభజన వల్ల 2,101 మంది టీచర్లకు స్థానచలనం కలగనుంది. 1,140 క్లియర్ వేకెన్సీలు, పొరుగు సేవలకు వెళ్లినవారి ఖాళీలు 28, స్టడీ లీవ్‌లకు వెళ్లిన వారి ఖాళీలు ఆరు, అప్‌గ్రేడ్ కారణంగా ఒక ఖాళీ ఉన్నాయి.

చాళుక్యుల కాలంనాటి శాసనం గుర్తింపు 7



ఈసెట్‌లో బాలికలదే పైచేయి
జిల్లాలో 94.50శాతం మందికి ఇంజనీరింగ్ ప్రవేశాల్లో అర్హత 7



ఈ భూమి ప్రభుత్వానిదే
● పొదిలి తహసీల్దార్ కృష్ణారెడ్డి 7

# పని చేసినా కూలి రాదాయే!

**ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇవ్వాలని హుకుం**

- అంగీకరించని 5 పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత
- వేతనం అందక కూలీల అవస్థలు
- పెద్దారవీడు మండలంలో 'ఉపాధి' సిత్రమిదీ..


పెద్దారవీడులో ఉపాధి కూలీలు

పెద్దారవీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): పనిచేసినా కూలి రాని పరిస్థితి పెద్దారవీడు మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో నెలకొంది. ఉపాధి కూలీలంతా ప్రతిరోజూ పనిచేస్తున్నారు. అందుకు సంబంధించిన మస్టర్లను మేట్లు సిద్ధం చేస్తున్నారు. కానీ చేసిన పనులకు సంబంధించి ఆన్‌లైన్ చేయడంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి కూలీలు చేసే పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన మండల, గ్రామస్థాయి అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి మండలంలో నెలకొంది.

**వారానికి రూ.200 వసూలు**

'ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి పనులకు వచ్చి పనిచేయనీ, చేయకపోనీ.. ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇస్తే మస్టర్లలో పేరు నమోదు చేస్తాం. లేకపోతే మీ పేర్లు గల్లంతే' అంటూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేసినట్లు, దీనికి 14 పంచాయతీల్లోని ఉపాధి హామీ కూలీలు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు సంబంధించి కూలీల వద్ద నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.200 వసూలు చేసి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించే మండల స్థాయి అధికారికి ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది.

**ఐదు పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత**

మండలంలోని ఐదు పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి హామీ పనులకు మస్టర్లు నమోదు చేయడంలో జాప్యం జరిగింది. మండల స్థాయి అధికారులు సూచించిన వారానికి రూ.200 వసూలు ప్రతిపాదన అమలుకాకపోవడమే ఇందుకు కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని పెద్దారవీడు, బద్వీటి చెర్లోపల్లి, చట్లమిట్ట, బోయలదుంపల, సానికవరం పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి పనులకు మస్టర్లు నమోదు కాలేదు. ఈ విషయమై మండలస్థాయి అధికారులను వివరణ కోరితే సర్వర్ సమస్య అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానంపై నెపం మోపుతున్నారు.

**2000 మంది కూలీల వేతనాలు నిలిపివేత**

మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో 2000 మంది ఉపాధి కూలీలకు వేతనాలను నిలిపివేశారు. పెద్దారవీడులో సుమారు 400, బద్వీటి చెర్లోపల్లిలో 500, చట్లమిట్టలో 400, బోయలదుంపలలో 300, సానికవరంలో 400 మందికి పని చేసినా వేతనం ప్రభుత్వం నుంచి పొందలేని పరిస్థితి నెలకొంది.

**జరిగిన తప్పులను సరిదిద్దుతాం**

మండలంలోని ఐదు పంచాయతీలలో మస్టర్లు నమోదు చేయకపోవడం వాస్తవమే. తాము డబ్బులు వసూలు చేయమని చెప్పామనడం నిజం కాదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- సుజాత, ఏపీవో, పెద్దారవీడు

**ప్రముఖులకు వాటాలంటూ ప్రచారం**

ప్రతివారం ఉపాధి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసే మొత్తంలో ఉన్నతాధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, విలేకరులకు వాటాలివ్వాలంటూ ఉపాధి హామీ సిబ్బంది జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు వాటా ఇవ్వకపోతే వారు బిల్లులు మంజూరు చేయరని, ప్రజా ప్రతినిధులకు వాటా ముట్టజెప్పకపోతే అసలు పనులే జరగనివ్వరని, క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించుకున్నదే అక్రమాల్లో వాటాల కోసమని, పాత్రికేయులకు ముడుపులు ఇవ్వకపోతే అక్రమాలపై కథనాలు ప్రచురిస్తే ఉపాధి పనుల్లో డొల్లతనం బయట పడుతోందని మండలస్థాయి అధికారులు ప్రచారం చేస్తున్నారు.

## అవీ..ఇవీ..

### కౌలుగుర్తింపు కార్డుదారులకే రాయితీ



సీసీఆర్‌సీ కార్డులపై సూచనలిస్తున్న తహసీల్దార్, ఏవో

పంగులూరు, మే 15(ఆంధ్రజ్యోతి):పంటసాగు చేసే కౌలు రైతులు తగిన గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు పొందగలుగుతారని తహసీల్దార్ సింగారావు, ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ముప్పవరం, కొండమూరు గ్రామాలలో గురువారం సి.సి.ఆర్.సి. కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 31 లోగా కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, వీఆర్వోలు సుబ్బారావు, రవిబాబు, వీఆర్ఏలు దిల్షా, దినేష్‌కుమార్, ఆయా గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

**పంట సాగుదారు హక్కుపత్రంతో ప్రయోజనం**

తోటవారిపాలెం (చీరాల) : పంట సాగు చేస్తున్న రైతులు సాగుదారు హక్కుపత్రం పొందడం ద్వారా ప్రయోజనం ఉంటుందని ఏవో సుమతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తోటవారిపాలెం సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీ సీఆర్‌పీ చట్టం -2019 ప్రకారం కార్డు కాలపరిమితి 11 మాసాలు మాత్రమే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీటీ సుశీలదేవి, సెక్రటరీ భారతి, నాదెండ్ల కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

**వేటపాలెంలో...**

మండల పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఖరీఫ్- 2025పై రైతులతో ప్రణాళిక నిర్వహించారు. ఈక్రమంలో పీఎండీఎస్ విధానంతో ఉపయోగాలను సూచించారు. భూమిలో చీడ పీడ లేకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వనాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పాలీసెట్‌లో హర్షిత్ ప్రతిభ



హర్షత్

అద్దంకిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌లో అద్దంకిలోని సంజీవనగర్‌కు చెందిన విద్యార్థి బత్తుల హర్షిత్ 120 మార్కులకు 111 మార్కులు సాధించాడు. రాష్ట్రస్థాయిలో 1304వ ర్యాంక్ సాధించాడు. ఏపీఆర్‌జేసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నందు 150 మార్కులకు 121 మార్కులు సాధించినట్లు విజేత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అంకమ్మరావు తెలిపారు. హర్షిత్ పదో తరగతిలో 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ అంజయ్య

అద్దంకి, మే 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలైన ఘటన మండలంలోని గోపాలపురంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన గోసాల అంజయ్య గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.

### ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోండి

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్(పిఎంజెఎవై)ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ప్రతినిధి శేషుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్, పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.



# ఆపత్కాలంలో అందని సాయం

**కేంద్ర ప్రభుత్వం నగదు రహిత చికిత్స పథకంపై ప్రజలకు అవగాహన లేమి..**



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు (ఫైల్)

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రెప్పపాటు కాలంలో జీవితాలను రోడ్డుప్రమాదాలు చిన్నాభిన్నం చేస్తుంటాయి. కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తి మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. ప్రమాదానికి గురైతే చికిత్స కోసం నగదు వెచ్చించి ఆర్థికంగా ఆయా కుటుంబాలు చితికిపోతాయి. దీన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం నగదు రహిత చికిత్స పథకం -2025ను తీసుకొంది. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో బాధితులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన క్రమంలో ప్రమాదానికి కారకులు కొందరు అందుబాటులో లేకుండా పరారవుతుంటారు. అలాంటి కేసులు పోలీసు స్టేషన్లలో కోకొల్లలున్నాయి. ప్రస్తుతం 216 జాతీయ రహదారి విస్తరించిన తర్వాత ఇలాంటి ప్రమాదాలు అనేకం ఉన్నాయి. అలాంటి సమయాల్లో బాధితులకు తక్షణం వైద్యసాయం అందక వేలసంఖ్యలో అయోమయం స్థితిలో ఉంటున్నారు. సాధారణంగా ప్రమాదానికి కారణమైన వాహనానికి సంబంధించి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌తో కొంత ప్రయోజనం ఉంటుంది. కానీ అసలు వాహనాలే గుర్తించకపోతే బాధితుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

**బాధితులను ఆదుకొనేలా..**

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఆపత్కాలంలో సాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు ప్రమాదం బారిన పడి సాయం పొందని వారికి ఈ పథకం ద్వారా మృతిచెందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు ప్రకటించింది. అందుకు సంబంధించి వివరాలు ప్రమాదం జరిగిన స్టేషన్ పరిధి నుంచి, అలాగే ఆయా ప్రాంత రోడ్డు రవాణా శాఖ అధికారి నుంచి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది. తద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ జరుగుతుంది. 2022లోనే కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టినా, నాటి వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నీరు కార్చింది. వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ఒక్కరంటే ఒక్కరికి కూడా సాయం అందజేయలేదు. అసలు ఈ పథకం ఉందని సామాన్య ప్రజలకు కూడా అవగాహన లేకపోవడంతో ఎందరో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఊహించని ప్రమాదం జరిగితే, అవగాహన లేక సాయం కూడా పొందని దయనీయ స్థితిలో ఉన్నారు.

**సాయం అందించడంపై టీడీపీ ప్రభుత్వం కసరత్తు**

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకంపై దృష్టి సారించింది. ప్రమాద బారిన పడిన ఏ ఒక్కరూ ఇబ్బందులకు గురి కాకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాల జారీ చేసింది. ఇప్పటికే అధికారులు దీనిపై కసరత్తు ప్రారంభించారు. అలాగే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులకు మార్గనిర్దేశాలు జారీ అయ్యాయి.

**ప్రభుత్వం నుంచి సర్క్యులర్ అందింది**

ఉన్నతాధికారుల నుంచి హిట్ అండ్ రన్‌పై సర్క్యులర్ అందింది. అలాగే వీటిపై సమీక్షలు నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం పథకంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పథకంతో బాధితులకు భరోసా ఉంటుంది.

**రామకృష్ణారెడ్డి, రోడ్డు భద్రత అధికారి, చీరాల**

# చిన్నారుల్లో విద్యాభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే కొండయ్య**



ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పిల్లలకు చక్కనైన విద్యా జ్ఞానం అవసరమని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లికి హైస్కూల్ విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులతో సత్తా చాటింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నేరుగా అనుమల్లి పేటలోని దివ్యశ్రీ ఇంటికి వెళ్లి ఆమెను ఘనంగా సత్కరించారు. అలాగే నగదు ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వ్యవస్థకు దీటుగా బోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు



చందలూరులో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన ఫ్యాన్లు

పంగులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని 10 పాఠశాలలు, ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, పవర్ సేవింగ్ ఫ్యాన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. విద్యుత్ ఆదా చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ధ్రువీకరించిన లైట్లు, ఫ్యాన్లను పాఠశాలలో అమర్చుతున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌లో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సమకూర్చిన 193 ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 198 పవర్ సేవింగ్ ఫ్యాన్‌లు ఆయా పాఠశాలల అవసరాలకు తగిన విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని చందలూరు, కొండమంజులూరు, ముప్పవరం, పంగులూరు ఉన్నత పాఠశాలలు, అలవలపాడు (ఉర్దూ), తూర్పు కొప్పెరపాడు, నూజెళ్ళపళ్ళి, కోటపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత, కొండమంజులూరు, నూజెళ్ళపల్లిలోని ప్రాథమిక పాఠశాలలతో పాటు ముప్పవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

## మందుబాబుల పరస్పర దాడులు

- చీరాల ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : మందుబాబులు పాతకక్షల నేపథ్యంలో పరస్పరం మద్యంసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటన గురువారం వేటపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని మద్యందుకాణం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుఫాన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ షేక్ కాలేషాకు, అదే ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీ ముఠామేస్త్రీ పల్లపు అంకమ్మరాజుకు ఇటీవల స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో మద్యం దుకాణంలో వేర్వేరుగా మద్యం సేవిస్తూ, ఘర్షణ పడ్డారు. దీంతో కాలేషా తలకు తీవ్ర రక్తగాయాలు కాగా, అంకమ్మరాజు స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

## డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచితంగా మూడు మాసాలు ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే శిక్షణకు సంబంధించిన వివరాలను 18 -30 సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని, వివరాలకు 79814 43777 నంబరును సంప్రదించాలని తెలిపారు.

# రహదారి నిర్మాణ పనులకు సహకరించండి

**రైతులను కోరిన తహసీల్దార్ సింగారావు**



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పంగులూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సాగుతున్న (బీవీఈసీ)గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను ఆటంకపరచడం తగదని, రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయిన రైతులకు జాప్యం లేకుండా ప్రభుత్వం తగిన పరిహారం చెల్లిస్తున్నదని తహసీల్దార్ సింగారావు అన్నారు. బెంగళూరు, విజయవాడ ఎలివేటెడ్ కారిడార్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులను ఆటంకపరచిన జేవీ పాలెం రైతులతో తహసీల్దార్ సింగారావు, సంబంధిత మేఘా ఇంజనీరింగ్ సంస్థ అధికారులు గురువారం చర్చించి వారికున్న అనుమానాలను నివృత్తి చేశారు. సేకరించిన భూమి వివరాలు, అందుకు నిర్దేశించిన నష్టపరిహారం, చెల్లింపుల గురించి వివరించారు. భూమి కోల్పోయిన రైతుల బ్యాంకు ఖాతాలలో సంబంధిత నగదు మొత్తాన్ని జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ జీఎం సుబ్బానాయుడు, హైవేస్ సీనియర్ మేనేజర్ జగదీష్, కృష్ణం రాజు, సురేష్‌కుమార్, నరేష్, అంకమ్మరావు, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులను రైతులకు సకాలంలో అందించాలి

**అద్దంకి ఏడీఏ శ్రీనివాసరావు**



డీలర్లుకు ఈపోస్ యంత్రాల పంపిణీ కార్యక్రమంలో మార్టూరు ,అద్దంకి ఏడీఈలు శ్రీనివాసరావు, ధనరాజ్

మార్టూరు, మే15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో: డీలర్లు అందించాలని మార్టూరు ఏడీఈ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మార్టూరులో పారదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో, జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మార్టూరు డివిజన్ పరిదిలోని డీలర్లుకు ఈ పోస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏడీఈ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న డిజిటల్ ఆధారిత చర్యలతో వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.రైతులకు మరింతగా లబ్ధి చేకూర్చే నూతన మార్గాలను నిరంతరం అన్వేషించడమే వ్యవసాయశాఖ ప్రధాన లక్ష్యమన్నారు.అనంతరం అద్దంకి ఏడీఈ ధనరాజ్ మాట్లాడుతూ రైతులకు అధికంగా లబ్ది చేకూర్చేలా ఎరువుల పంపిణీలో వ్యవస్థాపిత డిజిటలైజేషన్ లక్ష్యంగా ఈపోస్ యంత్రాల తయారీ చేయడం జరిగిందన్నారు. తరువాత యంత్రాలను వినియోగించే విధానంపై డీలర్లకు వ్యవసాయఅధికారులు అవగాహన కలిగించారు.అదేవిధంగా యంత్రాల ప్రత్యేకతలను,వాటి ప్రయోజనాలను పారదీప్ సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ ప్రభాకర్ డీలర్లుకు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్టూరు, అద్దంకి, కొరిశపాడు, జె పంగులూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు చెందిన వ్యవసాయఅధికారులు, పీపీఎల్ సంస్థ ప్రతినిధులు హరికృష్ణ,గోపి,వెంకట్రావు,పలువురు డీలర్లు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

- సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : డీపీటీవో రవికాంత్



గ్యారేజ్ లో సిబ్బందితో మాట్లాడుతున్న రవికాంత్

అద్దంకి, మే15 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని గుంటూరు, బాపట్ల డీపీటీవో రవికాంత్ చెప్పారు. అద్దంకి, మేదరమెట్ల బస్టాండ్లను, ఆర్టీసీ గ్యారేజ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. గతంలో అద్దంకి డిపో అధిక కేఎంపీఎల్ తీసుకవస్తూ, జిల్లా పరిధిలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం వెనుకబడి ఉందని, సిబ్బంది అందరు అంకితభావంతో పనిచేసి మరోసారి ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. అద్దంకి డిపోకు 13 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో ఆయా మార్గాలలో పాత బస్సుల స్థానంలో కొత్త వాటిని నడుపుతారని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, కొండలు తదితరులు ఉన్నారు.

# జాతీయ రహదారి పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం



కొనసాగుతున్న వంతెన నిర్మాణం

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) :వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకం పైపులైన్ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించిది. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. అయితే ఈ రహదారి, తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకానికి చెందిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌పై వెళుతున్న నేపథ్యంలో సమీపంలోని ఎత్తిపోతల పథకానికి ఇబ్బంది తలెత్తింది. దీనిపై స్థానిక రైతులు టీడీపీ నేత గోరంట్ల రామకృష్ణ ద్వారా ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి సమస్యను తీసుకుపోయారు. రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు ఉండడంతో పైప్‌లైన్ దెబ్బతిని నీటి సరఫరాలేక ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారి అధికారులతోపాటు, ఐడీసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన అధికారులు సమస్యాత్మక ప్రాంతంలో 40 మీటర్ల పొడవున పాతపైపులను తొలగించి కొత్త పైపులతోపాటు, శాశ్వత పరిష్కారంగా బాక్స్ కల్వర్టు నిర్మించేలా చర్యలు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో సంబంధింత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రెక్కల కష్టం బుగ్గిపాలు

- అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం
- రూ.2 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో దగ్ధమైన నగదు

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఊరికి దూరంగా ఉండే చెంచుకుటుంబం వారిది. నిత్యం కూలిపనులకు చేసుకుంటేనే వారి జీవనం సాగేంది. దీనికోసమే చంటి బిడ్డలను సైతం ఇంటిలో ఉంచి కూలికి వెళ్లారు. అయితే అనుకోని అగ్ని ప్రమాదం వారి రెక్కల కష్టాన్ని బుగ్గిపాలు చేసింది. వారు కష్టించి దాచుకున్న రూ.1.50 లక్షల నగదు, అరసవర బంగారం అగ్నికి ఆహుతైంది. మంటలు అంటుకున్న సమయంలో ఇంటిలోని చిన్నారులను స్థానికులు గమనించి బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం మండల కేంద్రమైన పర్చూరులోని చెంచుల కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన నల్లబోతుల రాజా కూలీనాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. దీనిలో భాగంగా గురువారం భార్య భర్తలు ఇరువురు కూలిపనులకు పోయారు. చంటిబిడ్డలైన ఇద్దరు చిన్నారులను ఇంటిలోనే ఉంచారు. ఈ క్రమంలో మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ఇంటిలోని చిన్నారులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి వారిని బయటకు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఇల్లు కాలిపోయింది. ఇంటితో పాటు ఇంటిలో కాయకష్టం చేసి సంపాదించి కూడ బెట్టుకున్న రూ.1.50 లక్షల నగదుతో పాటు, అరసవర బంగారు అభరణాలు కాలిబూడిద య్యాయి. చెంచుల కాలనీకి చెందిన ఇంటిలో మంటలు చెలరేగటంతో చుట్టుపక్కల వారు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా, మరే ఇతర కారణాల అనేది తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్సై మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు హుటా హుటినా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

**నిరాశ్రయులైన కుటుంబం**

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం వారిది చంటి బిడ్డలను ఇంటివద్దే వదిలివేసి కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని నింపింది. ప్రమాదంలో ఇంటిలో ఉన్న సామాన్లతో పాటు, కూలీనాలీ చేసుకొని సంపాదించుకున్న నగదు కాస్తా కాలిబూడిద కావటంతో వారు బోరున విలపిస్తున్నారు.

## నియోజకవర్గానికి 7 కోట్ల నిధుల మంజూరు

- సీసీరోడ్లు, సైడు డ్రైన్లు ఏర్పాటుకు పనుల గుర్తింపు

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్ కింద అద్దంకి నియోజకవర్గానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. పంగులూరు మండలంలో 30, బల్లికురవ మండలంలో 26, అద్దంకి మండలంలో 26, కొరిశపాడు మండలంలో 26, సంతమాగులూరు మండలంలో 32 పనులకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, ఇతర పనులు చేపట్టనున్నారు.

**కమ్యూనిటీ హాల్స్‌కు రూ.70 లక్షలు మంజూరు**

అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంలో బీసీ కమ్యూనిటిహాల్‌కు రూ.30 లక్షలు, బల్లికురవ మండలం సూరేపల్లిలో కమ్యూనిటీహాల్‌కు రూ.20 లక్షలు, కొరిశపాడు మండలం రాచపూడిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు రూ.20 లక్షలు మంజూరయ్యాయి.



# గంగమ్మా.. కరుణించమ్మా..

నేడు పాలేటిగంగ తిరునాళ్ల

**230మంది పోలీసులతో బందోబస్తు**

**కనిగిరి-కందుకూరు రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు**

పీసీపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి మండలం వెంగళాపురం సమీపంలో పాలేరునది చెంత కొలువై ఉన్న గంగాభవాని అమ్మవారి తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గంగాభవానిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. గురువారం గంగాభవాని గ్రామోత్సవం నిర్వహించారు.



విద్యుత్ దీపాలంకరణలో గంగాభవాని ఆలయం

1975లో జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 230మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 23మంది ఎస్సైలతో పాటు మరో 200మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లలో ఉన్నారు. ఈఏడాది తిరునాళ్లకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కనిగిరి-కందుకూరు రోడ్డులో ఆంక్షలు విధించామని ఎస్సై జి.కోటయ్య తెలిపారు. కనిగిరి నుంచి కందుకూరు వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు వయా పామూరు మీదుగా, కందుకూరు నుంచి కనిగిరి వైపు వెళ్లే వాహనాలు పామూరు మీదుగా వెళ్లేలా ట్రాఫిక్ దారి మళ్లించారు. అలాగే గుడికి రెండువైపులా దూరంగా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.

**● తొమ్మిది ప్రభల ఏర్పాటు**

ఈ ఏడాది తిరునాళ్లకు ఎన్నడూ లేనివిధంగా వివిధ గ్రామాలకు చెందిన వాళ్లు 9విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ 5, వైసీపీ 3, బీసీవై ఒక ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రభలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ముస్తాబైన గంగాభవాని మూలవిరాట్

## ఈసెట్‌లో బాలికలదే పైచేయి

**జిల్లాలో 94.50శాతం మందికి ఇంజనీరింగ్ ప్రవేశాల్లో అర్హత**

ఒంగోలు విద్య, మే 15(ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఈసెట్‌లో అర్హత సాధనలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్ర సగటు కంటే ఒక శాతం మంది అదనంగా అర్హత సాధించడం గమనార్హం. జిల్లాలో ఈసెట్‌కు 1,115 మంది హాజరు కాగా 1,085 మంది అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయిలో సగటున 93.26శాతం మంది అర్హత సాధించగా జిల్లాలో 94.50శాతం మంది అర్హత సాధించారు. బాలురు 767 మందికి 721 మంది, బాలికలు 318 మందికి 305 మంది క్వాలిఫై అయ్యారు. బాలురు 94శాతం, బాలికలు రాష్ట్ర సగటు కంటే ఐదుశాతం అదనంగా 96.91శాతం మంది ఇంజనీరింగ్ ప్రవేశాలకు అర్హత సాధించారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన పొగాకు రైతులు

ఒంగోలు కలెక్టరేట్, మే 15(ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు పొగాకు రైతులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామంలో వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం లోకేష్ వచ్చారు. ఈ సందర్భంగా ఆ మండలంలోని పలు గ్రామాలకు చెందిన పొగాకు రైతులు మంత్రి లోకేష్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. వెటనే మంత్రి లోకేష్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడుకు ఫోన్ చేసిపొగాకు రైతుల సమస్యలను చెప్పారు. ఈ విషయమై అవసరమైతే కేంద్ర పొగాకు బోర్డు అధికారులతో మాట్లాడాలని సూచించారు. అందుకు అచ్చెనాయుడు స్పందిస్తూ ధర పెంపు విషయమై ఇప్పటికే పొగాకు కంపెనీల ప్రతినిధులు, బోర్డు అధికారులతో మాట్లాడుతున్నానని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చూడాలని మంత్రి లోకేష్ కోరారు.

## 19 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలులో గురువారం చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 4,283 మంది విద్యార్థులకు 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ స్కూలు సొసైటీ పదోతరగతి పరీక్షలకు 1,260 మంది హాజరవుతుండగా వీరికి పదోతరగతి విద్యార్థులకు కేటాయించిన 36 పరీక్షా కేంద్రాల్లో 11 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీరికి ఒంగోలులో రెండు, దర్శిలో మూడు, కనిగిరి, వైపాలెం రెండేసి, మార్కాపురం, గిద్దలూరులో ఒక్కొక్క కేంద్రం కేటాయించారు. ఈ 11 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు, ఓపెన్ స్కూలు విద్యార్థులు వేర్వేరుగా పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఓపెన్ స్కూలు ఇంటర్మీడియేట్ పరీక్షలకు 3,132 మందికి 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని డీఈవో ఆదేశించారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ కె. శివకుమార్ పాల్గొన్నారు.

## చాళుక్యుల కాలంనాటి శాసనం గుర్తింపు

దర్శి, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజంపల్లి పంచాయతీలోని మునీ నది తీరాన నెలకొన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో చాళుక్యుల కాలం నాటి శాసనాన్ని పరిశోధకుడు ప్రసాద్ గుర్తించారు. ప్రాచీనాంధ్ర శాసనాలు అనే పుస్తకంలో బూదరాజు రాధాకృష్ణ అనే పరిశీలకుడు అక్కడ శాసనం ఉన్నట్లు ప్రస్తావించారని ఆయన తెలిపారు. చాళుక్యుల కాలం నాటి తెలుగు లిపిలో గల ఈ శాసనం 650 సంవత్సరంలో వేశారు. చాళుక్య వంశానికి చెందిన మొదటి విక్రమాదిత్యుడు ఇక్కడ రాజ్యపాలన చేసినట్లు శాసనంలో లిఖించి ఉన్నట్లు ఆయన చెప్పారు. విక్రమాదిత్య మహారాజు పాలనలో ఈ ప్రాంతంలో బ్రాహ్మణులకు ఇచ్చిన అగ్రహారాలు, దానాలు, ఆలయ భూములు పూర్వం ఏవిధంగా వినియోగించారో అలాగే కొనసాగించాలని ఆ శాసనంలో వివరించినట్లు తెలిపారు. మునీనది తీరాన ప్రాచీన కాలంలోనే ఆంజనేయస్వామి విగ్రహం ఇక్కడ ప్రతిష్ఠించి ఉన్నట్లు ఈ శాసనం ద్వారా తెలిసిందని పరిశోధకుడు ప్రసాద్ వివరించారు.



రాజంపల్లి పంచాయతీలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో చాళుక్యుల కాలంనాటి శాసనం



ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ క్రిష్ణారెడ్డి

## ఈభూమి ప్రభుత్వానిదే...

**తహసీల్దార్ కృష్ణారెడ్డి**

**ఆంధ్రజ్యోతి కథనంపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం**

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

పొదిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సర్వే నెంబర్ 219-2లో ఉన్న 1.86 సెంట్ల భూమి, అదే విధంగా 217లో 1.56 సెంట్ల భూమి ప్రభుత్వానికి చెందినదని తహసీల్దార్ కృష్ణారెడ్డి చెప్పారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఆపేదెవరు.. ఆక్రమించెయ్' శీర్షికన వచ్చిన కథనంపై తహసీల్దార్ స్పందించారు. రెండు సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణాన్ని సిబ్బందితో ఆయన గురువారం పరిశీలించారు. ప్రస్తుతం రెవెన్యూ ఆధీనంలో ఉన్నాయని, ఆ స్థలాలను ఎవరైనా కొనుగోలు, అమ్మకాలు చేయకూడదని స్పష్టం చేశారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మడానికి, కొనుగోలు చేయడానికి ఎవరికీ హక్కులేదన్నారు. ప్రస్తుతం 219-2 కోర్టులో ఉందని చెప్పారు. అదే విధంగా 217లో ఉన్న కుంట పోరంబోకు ఎకరా 56 సెంట్ల భూమి కూడా ప్రభుత్వానిదేనని, అందులో రెండు అక్రమ కట్టడాలు ఉన్నాయని తెలిపారు.

## చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

గిద్దలూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చిన ఓ వ్యక్తికి, కోర్టు సంవత్సరం జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించింది. కంభం గ్రామంలో బెస్తవీధికి చెందిన సొరకొండ శ్రీనివాసులు అనే వ్యక్తి నుంచి జె.పంగులూరు మండలానికి చెందిన ఎన్.ఎన్.స్మార్ట్ టెక్నాలజి ప్రొప్రైయిటర్ నాని లక్ష రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకున్న సమయంలో నాని చెక్కును ఇచ్చాడు. కొంతకాలం తరువాత శ్రీనివాసులు చెక్కును బ్యాంక్‌లో డిపాజిట్ చేశాడు. అయితే ఆ చెక్కు బౌన్స్ కాగా దీనిపై కేసు సుదీర్ఘ విచారణ చేపట్టి 7 సంవత్సరాలు జరిగింది. గురువారం జుడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి కె.భరత్‌చంద్ర నిందితుడు నానికి ఒక సంవత్సరం జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

# వైభవంగా మహాకుంభాభిషేకాలు

**శింగరకొండలో జీవధ్వజం, విమాన గోపుర కళశాలకు విశేష పూజలు**

**19న భారీ కార్యక్రమాలు**

అద్దంకి, మే 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న మహాకుంభాభిషేకంలో భాగంగా గురువారం జీవధ్వజస్తంభం, విమాన గోపుర కలశాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం కళశాలను యాగశాలలో ఉంచారు. పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభం కాగా రెండవరోజు గురువందనం, గణపతి పూజ, ప్రాతఃకాల మండపార్చనలు, సూర్యనమస్కారాలు, హహన్యాసపారాయణం, మూలవరులకు అభిషేకం, పంచగవ్యాధి వాసములు, ఆంజనేయ, రామ, సుదర్శన మంత్ర అనుష్టానం, వేదపారాయణం, సుందరకాండపారాయణం నిర్వహించారు. సాయంత్రం ఆవరణ దేవతాహవనం, ధాన్యాధివాసం, హవనాలు, బలిహరణ, దేవస్వస్తి, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీవధ్వజస్తంభం, విమానగోపుర కలశాలకు అభిషేకం, పూజలను ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు నిర్వహించారు. విమాన గోపుర దాత నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు, జీవ ధ్వజస్తంభం దాతలు మేదరమెట్ల రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిల దంపతులు ఆధ్వర్యంలో అభిషేకం, పూజలు చేశారు. దేవస్థానం మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, దేవస్థానం ముఖమండపం నిర్మాణ దాతలు గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గురువారం రాత్రి ప్రదర్శించిన భక్తప్రహ్లాద, కూచిపూడి నృత్య ప్రదర్శన, గోదా కల్యాణం ప్రత్యేక నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి.

**● కలశయాత్ర ఏర్పాట్లపై దృష్టి**

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మహాకుంభాభిషేకం సందర్భంగా 19న ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణం సమీపంలో పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది నుంచి సుమారు 1500 మంది మహిళలతో కలశయాత్ర ప్రారంభమవుతుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. కలశ యాత్రలో పాల్గొనే మహిళలు సుమారు 6 కి.మీ దూరం నడవాల్సి ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఈవో తిమ్మానాయుడు పలు స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. మార్గ మధ్యలో వాటర్‌బాటిల్స్ మజ్జిగప్యాకెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా లీడర్స్ అవసరమైన అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు.



జీవధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు,రిషిత దంపతులు

రమాసుందరీ, పూటుకూరు ఉమా అన్నపూర్ణ పాల్గొన్నారు.

# వాట్సాప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మన మిత్ర- ప్రజల చేతిలో ప్రభుత్వం ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగంచేసుకోనే విధంగా చూడాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం సాయంత్రం వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై రూపొందించిన క్యూ ఆర్ కోడ్ సేవలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్ ద్వారా 161 ప్రభుత్వ సేవలను మొదటిసారిగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సేవలు సాంకేతికంగా, సురక్షితం అని చెప్పారు. ప్రజల గోప్యత పట్ల అధిక ప్రాధాన్యతను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వాట్సాప్ గవర్నెస్ ద్వారా తొలిదశలో 161 ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయని, రెండో విడతలో మరో 360 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందని చెప్పారు. అందుకోసం 9552300009 నెంబర్‌ను వాట్సాప్ ద్వారా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, నారాయణ, శ్రీహరి, బాలశంకరరావు, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



వాట్సాప్ గవర్నెస్ క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

# వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులకు రిమాండ్

**ఒంగోలు జైలుకు తరలింపు**

**మరో ముగ్గురు కోసం ప్రత్యేక బృందాలు వేట**

ఒంగోలుక్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి) : వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులు 9 మందికి ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి నవ్యశ్రీ ఆదేశాలు జారీ చేశారు. గత నెల 22న వీరయ్యచౌదరిని దారుణంగా హత్య చేసిన కిరాయి హంతకులు ముగ్గురితో పాటు సూత్రధారులు, వారికి సహకరించిన మరో ఆరుగురిని బుధవారం ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో నగర శివారు ప్రాంతాలలో అరెస్టు చేశారు. వీరిలో ప్రధాన పాత్రధారి బోరుగుంట వినోద్‌కుమార్, కిరాయి హంతకులు తువ్వర కృష్ణ, బెల్లంకొండ వెంకటగౌతం, మన్నెం తేజ తోపాటు కీలక సూత్రధారి ఆళ్ల సాంబశివరావు, వారికి సహకరించిన మార్తూరి కిరణ్‌కుమార్, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, తోటా శ్రీనివాసరావు, షేక్ సమీర్‌లను అరెస్టు చేసి గురువారం ఉదయం ఒంగోలులోని 3వ అదనపు మునిసిఫ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. దీంతో న్యాయమూర్తి నవ్యశ్రీ వారికి 14రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు అక్కడ నుంచి ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించారు.

**● మరో ముగ్గురి కోసం వేట**

ఈ కేసులో కీలక సూత్రధారి సాంబశివరావు మేనల్లుడు ముప్పా సురేష్, కిరాయి హంతకుడు ఓబిలి నాగరాజు, గోళ్ల రుత్వేంద్ర బాబుల కోసం ఎస్పీ దామోదర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా ఈ కేసులో మరి కొంత మందిని విచారించాలని ఎస్పీ చెప్పారు.

## 20 వరకు డీఈఈసెట్ గడువు పొడిగింపు

ఒంగోలు విద్య, మే 15 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ)లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు డీసెట్ దరఖాస్తు గడువును పొడిగించినట్లు డీసెట్ చైర్మన్ బి.లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎయిడెడ్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిని శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల్లో నియమించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యార్థులతో సమానంగా అన్నిరకాల వసతులు కల్పించాలని వారు కోరారు.



# ఇటుకల ట్రాక్టర్ ఢీకొని సేల్స్ మేనేజర్ దుర్మరణం

**● నలుగురు కూలీలకు గాయాలు**

**● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ దామోదర్**

ఒంగోలు క్రైం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇటుకలు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ట్రాక్టర్ షోరూంలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న బోగిరెడ్డి వెంకటనారపరెడ్డి(58) దుర్మరణం చెందారు. ఈ ఘటన ఒంగోలులోని బృందావన్ ఫంక్షన్ హాల్ సమీపంలోని హైవేపై గురువారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలేనికి చెందిన వెంకటనారపరెడ్డి త్రోవగుంట సమీపంలోని ఓ ట్రాక్టర్ షోరూంలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన తన విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా వెనుక వైపు నుంచి ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనంపై నడపడంతో ద్విచక్రవాహనంపై నుంచి వెంకటనారపరెడ్డి రోడ్డు మీద పడ్డారు. అంతేగాకుండా ట్రాక్టర్ టైర్లు అతనిపై ఎక్కాయి. దీంతో వెంకటనారపరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి ట్రక్కు పక్కకు తిరగబడింది. దీంతో ట్రక్కు మీద ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. క్షతగ్రాతులను 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. వెంకటనారపరెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా, మరో కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. కాగా అదేసమయంలో ఈ మార్గంలో వస్తున్న ఎస్పీ ఏఆర్.దామోదర్ ఈ రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని గుర్తించి అక్కడ ఆగి పరిశీలించారు. వెంటనే మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించాలని పోలీసులను ఆదేశించారు. ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.



బైక్‌ను ఢీకొట్టిన డివైడర్‌పైకి ఎక్కి బోల్తా కొట్టిన ఇటుకల ట్రాక్టర్





ప్రమాదస్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు(ఇన్‌సెట్లో) వెంకట నారపరెడ్డి

## మెరుగైన వైద్యసేవలను అందించాలి

● కలెక్టర్ అన్సారియా



రోగుల వైద్యసేవల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం నాగులుప్పలపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను, పేషెంట్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ ట్రాకింగ్ విధానాన్ని పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కౌంటర్, రోగుల రిజిష్టర్ గది, సాధారణ గదులు, అత్యవసర విభాగం సేవలు, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. రోగులకు వైద్యసేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి ఆరోపణలు వచ్చినా తగిన చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమలో జేసీ గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఒనారియల్, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్వామివారి కల్యాణం మరుసటి రోజున ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, హోమం నిర్వహించారు. అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో వసంత సేవ నిర్వహించారు. భక్తులు వసంతం, రంగులు చల్లుకొని కోలాహలంగా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు. ఈవో రామకృష్ణారావు, చైర్మన్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లాబాషా కోరారు. స్థానిక భూగర్భగనులశాఖ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ జియాలజిస్ట్ శివకిషోర్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కార్మికులకు అందేలా చూడాలని కోరారు.

## సమ్మెకు మద్దతుగా నిరసనలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరగనున్న సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులులు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కేంద్రప్రభుత్వం బలహీనపర్చి నాలుగు కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ జరిగే సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ శ్రేణులు ఐక్యంగా ఉండాలి

ఎమ్మెల్యే దామచర్ల ● పార్టీ మండల, గ్రామ కమిటీలు ఏకగ్రీవం ● ఒంగోలు మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులు ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), మే15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. ఒంగోలు రూరల్ మండలం టీడీపీ మండల సర్వసభ్యసమావేశం గురువారం నగరంలోని బృందావన్ ఫంక్షన్‌హాలులో జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మండలంలోని పలు గ్రామాల మధ్య లింక్ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దశరాజుపల్లి నుంచి కరవది, వలేటివారిపాలెం గ్రామాలకు ముదిగొండి వాగుపై వంతెనలు, తారురోడ్లు నిర్మించాలని కోరారు. అదేవిధంగా మండవవారిపాలెం నుంచి మంగమ్మ కళాశాల వరకు తారురోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కరవది నుంచి కొప్పోలుపోవు రోడ్డులో ముదిగొండివాగుపై వంతెన నిర్మించాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గ్రామాల్లోని శ్మశానాలకు పూర్తి స్థాయిలో ప్రహరీలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చేజర్ల, ఉలిచి, బీవీపాలెంలో వాటర్‌ప్లాంట్లు నిర్మాస్తామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రూపులు కట్టవద్దని, అందరూ ఒక కుటుంబం మాదిరిగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడిగా గుండపునేని శ్రీనివాసులు, మండల క్లస్టర్ కన్వీనర్‌గా నలమోతు బాలగంగాధర్, మండల యువత అధ్యక్షుడుగా వలేటి రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామ పార్టీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, పోలవరపు వెంకటరామయ్య, వై.వెంకటశేషయ్య, పూర్ణచంద్రరావు, గుండపునేని శ్రీనివాసులు, పిల్లుట్ల సుధాకర్‌రావు, గద్దె వెంకటకృష్ణ, మండవవారిపాలెం మాజీ సర్పంచ్ మారెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. చేపట్టిన పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి ఉండటంతో పాటు పని ప్రదేశంలో తాగునీరు, నీడ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గురువారం మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు సకాలంలో వారి ఖాతాల్లో కూలి డబ్బులు పడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇనమనమెళ్లూరు ఫీల్డ్ చానల్‌ను కలెక్టర్ పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు దినసరి కూలి రూ.300 దక్కేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులు ఉదయం 6 నుంచి 11 గంటల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌వరప్రసాద్, తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్





సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా మాతాశిశు సంరక్షణ సేవలు అందిస్తున్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో 20 ఏళ్ళ క్రితం కేవలం రూ.50నుంచి రూ.100 ఇన్సెంటివ్ కోసం నియమితులైన ఆశా వర్కర్ల సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోయినా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. కొవిడ్ కాలంలో సామాజిక బాధ్యతగా ఆశాలు సేవలు అందించారని చెప్పారు. గ్రామాల్లో అనేక సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ఆశాల ఉద్యమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. అదే స్ఫూర్తితో ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నిర్దిష్టమైన పనిగంటలు, సెలవులు అమలు కాకపోవడం, ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. ఆశాలకు జాబ్‌చార్ట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్యమాలకు అధికారుల అనుమతి అవసరం లేదన్నారు. ఆధునిక బానిసలుగా చేసే కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలన్నారు. సదస్సులో యూనియన్ కార్యదర్శి పి.కల్పన, అరుణ, అనూష, సిఫోరా, విజయ, కోటేశ్వరి, నాగమ్మ, విశ్రాంతమ్మ, సుశీల, బాలమ్మ, అరుంధతి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సహాయ కార్మిక కమిషనర్ కె.కనకదుర్గాభవాని గురువారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్మాగారాలు, దుకాణాలలో పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్మికుల పని ప్రదేశాల్లో శాల్లో చల్లని నీరు, నీడ వసతి కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసరమందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్మికుల పనివేళలను మార్పులు చేసేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాల ఎదురుగా గురువారం మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలయ్యాయి. అద్దంకి పట్టణానికి చెందిన ఆర్.ఉమామహేశ్వరరావు తన మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

## అశ్వవాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం కొలచనకోట గ్రామంలో అశ్వవాహనంపై విహరించారు. ఉభయదాతలు మోపర్తి సుబ్బారావు, మోపర్తి సందీప్‌చౌదరి, ఘంట సింగయ్య, జి.చిన్నఅబ్బయ్యచౌదరి, మోపర్తి చెంచురామయ్య, గుండ్లాపల్లి వెంకటకృష్ణయ్య, మోపర్తి గోపీనాథ్, గంట సుబ్బారావులు వ్యవహరించారు. కళ్యాణం అనంతరం స్వామివారు గ్రామానికి రావటం ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా నాయబ్‌రసూల్



తహసీల్దార్‌కు బొకేను అందజేస్తున్న సిబ్బంది

ఒంగోలు(రూరల్), మే15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్‌గా నాయబ్‌రసూల్ నియమితులయ్యారు. గురువారం ఒంగోలులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, వీఆర్వో రామకృష్ణ, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉపాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం





వైద్యశిబిరంలో పాల్గొన్న ఆసుపత్రి సిబ్బంది

ఒంగోలు కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గురువారం స్థానిక కొప్పోలురోడ్‌లోని ఎఫ్‌సీఐ గూడెంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్లు జయవర్ధన్, వేమవరపు మహేష్ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాస్ డైరెక్టర్లు డాక్టర్లు ఉమాపతిచౌదరి, ప్రకాష్ చావల, అనీల్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకటేష్‌బాబు, జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం తగదు

ఒంగోలు విద్య, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకట్రావు, లక్ష్మీనారాయణ, ఐపీయా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన హేతుబద్ధంగా జరగలేదన్నారు. ప్రభుత్వం చెప్పినట్లు తరగతికి ఒక టీచర్‌ను నియమించలేదన్నారు. ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాల్లోని తప్పులను సవరించాలని వారు కోరారు.

## మెప్మా ఆధ్వర్యంలో రేపు మెగా జాబ్ మేళా

● పీడీ శ్రీహరి

ఒంగోలు కార్పొరేషన్, మే 15 (ఆందరజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు సంఘాలలోని సభ్యులైన వారి పిల్లల కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ పి.శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్ జంక్షన్‌లోని నాగార్జున డిగ్రీ కాలేజీలో జరిగే మేళాలో 30కి పైగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అలాగే ఐటీ, ఫార్మసీ, ప్రొడక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్, పలు కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన సంఘ సభ్యుల పిల్లలు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పొదుపు మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన రాపిడో బైక్‌లు పంపిణీ, మెప్మా బజార్ నిర్వహణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పారదర్శకంగా భూముల రీసర్వే



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పనులు పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం అన్నంగి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని రికార్డులను అధికారులకు చూపించి కట్టుదిట్టంగా రీసర్వే చేయించుకోవాలన్నారు. రైతులకు సంబంధించిన ఫోన్ నెంబర్లు వాట్సాప్ గ్రూపుగా చేసి ఎప్పటికప్పుడు రీ సర్వే పనుల వివరాలను వెల్లడించాలని చెప్పారు. ఎవరైనా రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో షేక్ మీరావలి, సర్వేయర్లు పాల్గొన్నారు.

## 1600 గ్రాముల గంజాయి స్వాధీనం

దాని విలువ రూ.50 వేలు

రెండు గ్రామాల్లో ఐదుగురు విక్రేతల అరెస్టు

ఎర్రగొండపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గంజాయి అక్రమ నిల్వలు ఉన్న ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అరెస్టు అయిన ముగ్గురు నిందితుల వద్ద 1450 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్లె పోగు సాగర్‌బాబు వద్ద 750 గ్రాములు, మాట చిన్న చెంచయ్య వద్ద 350 గ్రాములు, యుద్దనపూడి హైజాక్ వద్ద 350 గ్రాముల గంజాయి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం పట్టుబడిన 5 మందిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి మార్కాపురం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎర్రగొండపాలెం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ సిబ్బంది, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అయ్యోగానిపల్లెలో..

పుల్లలచెరువు : మండలంలోని మానేపల్లి పంచాయతీ అయ్యోగానిపల్లెలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. గురువారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అయ్యోగానిపల్లె సమీపంలోని అక్రమంగా ఉన్న 150 గ్రాముల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పొలంలో ఉన్న 5 గంజాయి మొక్కలను వారు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్.శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

● ఆర్మీ ఉద్యోగి మనోహర్‌కు కన్నీటివీడ్కోలు

రాచర్ల (గిద్దలూరు), మే 15 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి గంజికుంట్ల మనోహర్ (40) మృతదేహానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. రాచర్లకు చెందిన మనోహర్ కుటుంబ సభ్యులతో కలిసి ముంబయిలో నివాసం ఉంటూ ఆ ప్రాంతంలోనే ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా మంగళవారం గుండెపోటుకు గురై మృతిచెందారు. బుధవారం రాత్రి మనోహర్ మృతదేహాన్ని స్వగ్రామమైన రాచర్లకు తీసుకురాగా, గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు. సైనిక ఉద్యోగులు, మాజీ సైనిక ఉద్యోగులు మనోహర్‌కు ఘనంగా నివాళులర్పించారు. 22 ఏళ్లపాటు దేశరక్షణలో సేవలందించిన మనోహర్‌కు గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు.



మనోహర్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సైనిక ఉద్యోగులు, మాజీ సైనికులు

# మార్కాపురం ప్రాంతంలో భారీ వర్షం

● వేసవితాపం నుంచి ఉపశమనం



మార్కాపురంలోని అయ్యప్పస్వామి గుడి వద్ద నిలిచిన వర్షపు నీరు



అమానిగుడిపాడు గ్రామం వద్ద పారుతున్న వాగు

మార్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గురువారం వేకువజామున భారీ వర్షం కురిసింది. ఉదయం 4.00 నుంచి 6.30 గంటల వరకు వర్షం పడింది. దీంతో పట్టణంలోని పలు శివా రు కాలనీల్లో రహదారులపై నీళ్లు నిలిచాయి. అంతేకాక మురుగు కాలువలు పొంగిపొర్లాయి. గత కొన్నాళ్లుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వేకువజామున కురిసిన వర్షంతో ఉపశమనం లభించినట్లైంది. పట్టణంతోపాటు మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో కూడా భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు వేసవి దుక్కులు దున్నిన రైతులకు ఈ వర్షం మేలు చేకూర్చినట్లైంది. వర్షం ప్రభావంతో ఉద్యాన పంటలకు కూడా నీటి తడులు ఇచ్చే ఇబ్బందులు తప్పినట్లైంది.

పండ్ల తోటలకు జీవం

ఎర్రగొండపాలెం: మండలంలో గురువారం వేకువ జామున 10 మీమీ వర్షం కురిసింది. ఈ వర్షం సాగులో ఉన్న పండ్ల తోటలకు జీవం పోసిందని రైతులు చెప్తున్నారు. మండలంలో సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, అరటి, బొప్పాయి తోటల సాగు రైతులు ఊరట చెందారు. బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోగా ఈ వానతో నీటి వనరు లభిస్తుందని, వాడుముఖం పట్టిన తోటలకు మేలు చేకూరుతుందని రైతులు తెలిపారు.

పొంగిన వాగులు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని అమానిగుడిపాడు, గుర్రపుశాల, తమ్మడపల్లి గ్రామాలలో గురువారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. దీంతో అమానిగుడిపాడు కుంట రహదారిలోని మధ్యలో ఉన్న వద్దుల వాగు పొంగిపొర్లింది. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు అమానిగుడిపాడు ప్రజలు తెలిపారు.

# చిలకలేరుపై చప్టా పూర్తయ్యేనా..?

● ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు



పైపుల ఏర్పాటుకే పరిమితమైన చప్టా నిర్మాణం

తాళ్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం- పోలవరం రోడ్డు మార్గంలో చిలకలేరుపై రూ.2కోట్ల 40లక్షల నిధులతో చేపట్టిన చప్టా నిర్మాణపనులు 8 ఏళ్లుగా నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండల శివారు గ్రామమైన విఠలాపురం నుంచి పోలవరం గ్రామం మీదుగా అద్దంకి రాకపోకలు సాగిస్తుంటారు. ఈమార్గంలోగల చిలకలేరులో నీటి ప్రవాహం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు గుర్తించి ఎస్డీఎఫ్, ఎన్నార్జియస్‌ల కింద రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. విఠలాపురం గ్రామపంచాయతీ వారు 2017లో పనులు చేపట్టారు. వర్షాలు లేక పోవటంతో పనులు వేగవంతంగాసాగాయి. ఆ నిధులతో పూర్తి స్థాయిలో పనులు పూర్తికావని మరో రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. మొదటి విడతగా మంజూరైన నిధుల్లో ఎస్‌డీఎఫ్ కింద ఉపాధి హామీ పథకం కింద రూ.కోటి మేర పనులు జరిగాయి. చిలకలేరులో చప్టా నిర్మాణకోసం పైపులు ఏర్పాటు చేసి ఇరువైపులా గోడలు నిర్మించారు. అయితే, పనులు జరుగుతున్న తరుణంలో 2019లో ఎన్నికలు రావటంతో పనులు నిలిచిపోయాయి. రెండవ పర్యాయం మంజూరు చేసిన నిధులు గత వైసీపీ ప్రభుత్వంలో రావన్న కారణంతో పనులు చేపట్ట లేదు .గత 8 ఏళ్లుగా చప్టా పనులు ముందుకు సాగక పోవటంలో చిలకలేరుపై రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోయింది. అద్దంకికి దగ్గర మార్గంగా ఉండటంతో విఠలాపురం గ్రామానికి చెందిన ప్రజలు నిత్యం పోలవరం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చప్టా పక్కగుండా వెళ్లేందుకు రోడ్డు లేకపోవటం, చప్టా నిర్మాణం కోసం పైపులువేసి మిగిలిన పనులు పూర్తికాక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పోలంవరం గ్రామానికి చెందిన పశువుల కాపరులు, జీవాలపెంపకందార్లు చిలకలేరు దాటి అవతల గల పొలాలకు మేతకు వెళ్లాలి. అయితే, చప్టాపై వెళ్లేందు కు వీలులేక, వర్షాలు పడినప్పుడు ప్రవహించే చిలకలేరు దాటలేక అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి చప్టా నిర్మాణాన్ని పూర్తి చేయించాలని విఠలాపురం, పోలవరం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

- నాయకుల నిర్లక్ష్యంతో ఉపయోగంలోకి రాని భవనాలు
- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- బేస్ మట్టం, స్లాబ్ లెవల్లోనే నిలిచిన వైనం
- నిధుల ఆలస్యంతో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్లు

**మండలంలో మొత్తం గ్రామ వార్డు సచివాలయాలు 21, రైతు సేవా కేంద్రాలు 21, హెల్త్ క్లినిక్‌లు 14 అవి ఏఏ స్థితిలో ఉన్నయో వాటి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ వార్డు సచివాలయాలు 21 కాగా, వాటిలో 16 పూర్తి అయ్యాయి. రైతు సేవా కేంద్రాలు మొత్తం 21కి గాను 10 పూర్తి అయ్యాయి. హెల్త్ క్లినిక్ సెంటర్లు మొత్తం 14కు గాను 4 పూర్తి అయ్యాయి.**

ఎర్రగొండపాలెం రూరల్ మే 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో అధికారుల, నాయకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామ వార్డు సచివాలయాలు కొన్ని పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాలలో పూర్తయినప్పటికీ అక్కడ రాజకీయ నాయకుల సమన్వయలోపం కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అలాగే సరైన సమయంలో గత వైసీపీ పాలకులు నిధులను మంజూరు చేయకపోవడంతో ఎక్కడికక్కడ భవనాలు అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి. పూర్తి స్థాయిలో భవనాలు లేకపోవడంతో రైతు సేవా కేంద్రాలలో, పూర్తి కాని భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.



వైపాలెంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం

**గ్రామ వార్డు సచివాలయాలు**

బేస్ మట్టం లెవల్‌లో 1 అమానిగుడిపాడు గ్రామంలోనిది (కోర్టులో ఉంది), స్లాబ్ లెవల్లో 2 గంగాపాలెం, గుర్రపుశాల, వివిధ దశలో ఉన్నవి వై.పాలెం 2 సచివాలయం, గోళ్లవిడపిలోని సచివాలయం.



గంజివారిపల్లిలో పూర్తయినా ప్రారంభం కాని సచివాలయం

**రైతు సేవా కేంద్రాలు**

బెస్‌మట్టం లేవల్లో మొత్తం 6 ఉన్నాయి. వాటి వివరాలు అమానిగుడిపాడు, బోయలపల్లి, గుర్రపుశాల, వెంకటాద్రిపాలెం, పాలుట్ల, వై.పాలెంలో 4, స్లాబ్ లెవల్లో 1 వై.పాలెం 1 సచివాలయం, రూఫ్ లేవల్లో 1 గోళ్లవిడిపి,




రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

లాస్ట్ స్టేజిలో 3 గురిజేపల్లి, మిల్లింపల్లి, వై.పాలెంలో రెండు ఉన్నాయి.

**హెల్త్ క్లినిక్ సెంటర్లు**

బేస్ మట్టం లెవల్లో 3 గుర్రపుశాల, వై.పాలెంలో 3, వై.పాలెంలో 4, స్లాబ్ లెవల్లో 3 గంగాపాలెం, గోళ్లవిడిపి, వై.పాలెం 1, మధ్య దశలో ఉన్న 1, లాస్ట్ స్టేజిల్లో 3 ఉన్నవి.

గత వైసీపీ వాటి నిర్మాణానికి అవసరమైన నిధులను సరైన సమయంలో విడుదల చేయకపోవడంతో ఎక్కడికక్కడ భవనాలు నిలిచిపోయినట్లు తెలుస్తుంది. ఇలా ఆర్భాటంగా గ్రామ వార్డు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ సెంటర్లు అంటూ ఐదేళ్ల పలికిన గత పాలకులు వాటిని పూర్తి చేసే విషయంలో మాత్రం శ్రద్ధ చూపించలేదని విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా గ్రామా వార్డు సచివాలయా లు పేరుకు మాత్రమే ఉన్నాయంటూ పలువురు అభిప్రాయ పడుతున్నారు. అయితే సిబ్బంది మాత్రం పూర్తిస్థాయిలో వసతులు లేక పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్తున్నారు.

ఈ విషయాలపై పంచాయితీ రాజ్ జేఈ రవీంద్రరెడ్డిని వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చానని వాటి వివరాలను సేకరిస్తున్నాని పూర్తి వివరాలు తెలుసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.



బహుమతులను అందిస్తున్న డిపో మేనేజర్ నరసింహులు

## ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలి

**డిపో మేనేజర్ నరసింహులు**

మార్కాపురం వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు, కార్మికులు తమ వంతు సహాయ సహకారాలు అందించి కృషి చేయాలని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఏప్రిల్‌కు సంబంధించి ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హై ఈకేపీ సాధించిన కండక్టర్లు సయ్యద్ బాషాహుసేన్, వి.సుబ్రహ్మణ్యం, ఎ.రామిరెడ్డి, హై కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు వీబీ కాశయ్య, ఎంవీ కాశయ్యలను అభినందించి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందించారు. ప్రతిభ కనబర్చిన డ్రైవర్ ఎమ్.శ్రీనివాసులు, కండక్టర్లు జి.మూర్తయ్య, ఎస్‌కెఎన్ అహ్మద్‌లకు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదరంగంపై శిక్షణ



చదరంగం నేర్చుకుంటున్న విద్యార్థులు

గిద్దలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం జరిగిన వేసవి శిబిరంలో విద్యార్థులకు క్యారమ్స్ చదరంగం ఆటల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం కథలు, చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీలు రామిరెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

## రూ.2లక్షల సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గిద్దలూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పాలుగుళ్ల కిరణ్‌కుమార్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణికి కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ విరాళం కింద యూటీఎఫ్ నాయకులు రూ.2లక్షల చెక్కును గురువారం అందజేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళలర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

## 1600 గ్రాముల గంజాయి స్వాధీనం

- దాని విలువ రూ.50 వేలు
- రెండు గ్రామాల్లో ఐదుగురు విక్రేతల అరెస్టు

ఎర్రగొండపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గంజాయి అక్రమ నిల్వలు ఉన్న ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అరెస్టు అయిన ముగ్గురి నిందితుల వద్ద 1450 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్లె పోగు సాగర్‌బాబు వద్ద 750 గ్రాములు, మాట చిన్న చెంచయ్య వద్ద 350 గ్రాములు, యుద్దనపూడి హైజాక్ వద్ద 350 గ్రాముల గంజాయి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం పట్టుబడిన 5 మందిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి మార్కాపురం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎర్రగొండపాలెం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ సిబ్బంది, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

**150 గ్రాముల గంజాయి పట్టివేత**

పుల్లలచెరువు : మండలంలోని మానేపల్లి పంచాయతీ అయ్యాగానిపల్లెలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. గురువారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అయ్యాగానిపల్లె సమీపంలోని అక్రమంగా ఉన్న 150 గ్రాముల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పొలంలో ఉన్న 5 గంజాయి మొక్కలను వారు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



మేడపిలో గంజాయి ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు



బాధితులకు పరికరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

## పరికరాలను వినియోగించుకోండి

పొదిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరిన్ బాధితులకు ఇచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ వేము అనిల్‌కుమార్ అన్నారు. గురువారం నగరపంచాయతీలోని రాజుపాలెం గ్రామంలో ఫ్లోరిన్ బాధితులకు గతంలో వీల్‌చైర్స్ 24, వాకర్స్ 22, వాకింగ్ స్టిక్స్ 21, వెస్ట్రన్ కమోడీటీలు 18 అందజేశామని చెప్పారు. గురువారం వాటిని పరిశీలించిన అనిల్‌కుమార్ పరికరాల వినియోగంపై బాధితులకు అవగాహన కల్పించారు. ఏవైనా పరికరాలు పాడైతే కొత్తవి ఇచ్చేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఫ్లోరోసిస్ బారినపడిన వారిని గుర్తించి పరికరాలను అందజేస్తామన్నారు. ఆరోగ్యకరమైన పోషక ఆహారం, పరిశుభ్రమైన మంచినీటిని తాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉప్పలపాడు వైద్యాధికారి ఎం.సుగుణకుమార్, అర్బన్ వైద్యాధికారి శరత్‌చంద్ర, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## సచివాలయాల పరిశీలన

కంభం, మే 15 (ఆంధ్రజ్యోతి) : కంభం అంగన్‌వాడీ కేంద్రాలను, సచివాలయాలను రాష్ట్ర చైల్డ్ రైట్ కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. చిన్న పిల్లలకు ఇచ్చే అల్పాహారాన్ని రుచి చూసి కేంద్రాలలో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు సలహాలు, సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల తల్లులు, గర్భిణులు, చిన్న పిల్లలకు ఇచ్చే గుడ్ల సైజు చిన్నవిగా ఉండడంపై సీడీపీవోను ప్రశ్నించారు. పెద్దసైజు గుడ్లను ఇచ్చేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని సూచించారు. కంభం సంగవీధిలో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు తక్కువగా ఉండడం, గత 3 రోజులుగా హాజరు వేయని విషయం గ్రహించి అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీడీపీవో నీలోఫర్, తహసీల్దార్ కిరణ్, ఈవోఆర్డీ విజయలక్ష్మి, కంభం సర్పంచ్ బోడయ్య పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పద్మావతి

## హనుమంతు వాహనంపై వేణుగోపాలుడు



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న గ్రామస్థులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం హనుమంతుని వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం గ్రామంలో గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. బొడ్డుపల్లి పవన్ కుమార్ శర్మ, ఆలయ అర్చకులు అన్నమరాజు రమేష్ బాబు శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ యక్కలి బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

మార్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడపుతూ పోలీసులకు పట్టుబడిన ఐదుగురికి మార్కాపురం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీ గురువారం జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. గత వారం వ్యవధిలో మార్కాపురం టౌన్ పోలీసులు పలుచోట్ల తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఐదు మందిలో నలుగురికి రూ.10 వేల చొప్పున, ఒకరికి రూ.5 వేల మేర జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 25 రోజుల జైలు శిక్ష విధించనున్నట్లు తీర్పులో పేర్కొన్నారు.

## కట్టెల టాక్టరును డీకొన్న కారు

**- కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు**

ఎర్రగొండపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం కర్నూలు గూంటూరు జాతీయ రహదారిపై గుట్టల ఉమ్మడివరం గ్రామం వద్ద గురువారం కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వజ్రగిరి కొండమ్మ (45) మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కారులో వెనుక సీటులో కూర్చున్న కొదమల కుమారి, షారోన్, ప్రశాంత్‌రాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారంతా పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం కాగా, పుల్లలచెరువు మండలం చౌటపాశర్లలో కార్యక్రమానికి వెళ్లి తిరిగి సొంత ఊరు వెళ్తున్నారు. త్రిపురాంతకం మండలం గుట్టల ఉమ్మడివరం వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ 108లో వినుకొండలో ప్రవేటు వైద్యశాలకు చేర్పించి చికిత్సలు చేయిస్తున్నట్లు ఎస్ఐ బసవరాజు తెలిపారు.

## రోగులకు మెరుగైన సేవలందించాలి

**ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి**

గిద్దలూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం గిద్దలూరు ఏరియా ఆసుపత్రి మీటింగ్ హాల్లులో 6 మండలాల వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఓపీ గదిని, ప్రైమరీ ఔషధాలయం, ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులు ఎంతమేరకు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత, వైద్యుల కొరత అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ గ్రామీణ ప్రాంతాలలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిని గత పాలకులు మరచి 100 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 40 పడకలకు మార్చడం శోచనీయమన్నారు. ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, కాంపౌండ్ వాల్, సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. 108, 104 సర్వీసులు ప్రజలకు ఏవిధంగా సర్వీసు అందిస్తున్నాయో రికార్డులను తనిఖీ చేశారు. నియోజకవర్గంలో 24 గంటలపాటు తెరచి ఉండే ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, 6 మండలాల వైద్య అధికారులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.




వైద్యాధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

## భారీ వర్షం



అయ్యప్పస్వామి గుడివద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మార్కాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గురువారం వేకువజామున భారీ వర్షం కురిసింది. ఉదయం 4.00 నుంచి 6.30 గంటల వరకు వర్షం పడింది. దీంతో పట్టణంలోని పలు శివారు కాలనీల్లో రహదారులపై నీళ్లు నిలిచాయి. అంతేకాక మురుగు కాలువలు పొంగిపొర్లాయి. గత కొన్నాళ్లుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వేకువజామున కురిసిన వర్షంతో ఉపశమనం లభించినట్లైంది. పట్టణంతో పాటు మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో కూడా భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు వేసవి దుక్కులు దున్నిన రైతులకు ఈ వర్షం మేలు చేకూర్చినట్లైంది. వర్షం ప్రభావంతో ఉద్యాన పంటలకు కూడా నీటి తడులు ఇచ్చే ఇబ్బందులు తప్పినట్లైంది. రైతులు ఊరట చెందారు. బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోగా ఈ వానతో నీటి వనరు లభిస్తుందని, వాడుముఖం పట్టిన తోటలకు మేలు చేకూరుతుందని రైతులు తెలిపారు.



అమానిగుడిపాడు వద్ద పారుతున్న వాగు

**పండ్ల తోటలకు జీవం**

ఎర్రగొండపాలెం : మండలంలో గురువారం వేకువ జామున 10 మీ.మీ వర్షం కురిసింది. ఈ వర్షం సాగులో ఉన్న పండ్ల తోటలకు జీవం పోసిందని రైతులు చెప్తున్నారు. మండలంలో సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, అరటి, బొప్పాయి తోటల సాగు

**పొంగిన వాగులు**

**నిలిచిపోయిన రాకపోకలు**

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని అమానిగుడిపాడు, గుర్రపుశాల, తమ్మడపల్లి గ్రామాలలో గురువారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. దీంతో అమానిగుడిపాడు కుంట రహదారిలోని మధ్యలో ఉన్న వద్దుల వాగు పొంగిపొర్లింది. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు అమానిగుడిపాడు ప్రజలు తెలిపారు.

## పొదిలి నుంచి శింగరకొండకు ప్రత్యేక బస్సులు

పొదిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శింగరకొండకు పొదిలి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం శంకరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికుల కోరిక మేరకు పొదిలి నుంచి శింగరకొండకు శనివారం, మంగళవారాల్లో ఉదయం 9, మధ్యాహ్నం 1.15, 3.15 గంటలకు ప్రత్యేక బస్సులు తిప్పనున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్నట్లయితే సర్వీసులను కొనసాగిస్తామని డీఎం శంకరరావు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం శంకరరావు

## సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

**ఆర్మీ ఉద్యోగి మనోహర్‌కు కన్నీటివీడ్కోలు**

రాచర్ల (గిద్దలూరు), మే 15 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి గంజికుంట్ల మనోహర్ (40) మృతదేహానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. రాచర్లకు చెందిన మనోహర్ కుటుంబ సభ్యులతో కలిసి ముంబయిలో నివాసం ఉంటూ ఆ ప్రాంతంలోనే ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా మంగళవారం గుండెపోటుకు గురై మృతిచెందారు. బుధవారం రాత్రి మనోహర్ మృతదేహాన్ని స్వగ్రామమైన రాచర్లకు తీసుకురాగా, గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తిచేశారు. సైనిక ఉద్యోగులు, మాజీ సైనిక ఉద్యోగులు సెల్యూట్ చేసి మనోహర్‌కు ఘనంగా నివాళులర్పించారు. 22 ఏళ్లపాటు దేశరక్షణలో సేవలందించిన మనోహర్‌కు గ్రామస్థులు కన్నీటి వీడ్కోలు పలికారు.



మనోహర్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సైనిక ఉద్యోగులు, మాజీ సైనికులు

## బియ్యం అందజేత

గిద్దలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాశినాయన దేవాలయంలో ప్రతి బుధవారం జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి తమ వంతుగా పొదలకొండపల్లి గ్రామానికి చెందిన చేరెడ్డి సుబ్బమ్మ, చేరెడ్డి నారాయణమ్మలు 100 కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో కాశినాయన దేవస్థాన ప్రతినిధులు నారాయణరెడ్డి, పిడతల రమేష్‌రెడ్డి, రెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

## రైలు కిందపడి వృద్ధుడు మృతి


రమణారెడ్డి (ఫైల్)

కురిచేడు, మే 15(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ కాటంవారిపల్లె గ్రామానికి చెందిన సంగు రమణారెడ్డి (55) ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతిచెందాడు. ఈఘటన గురువారం తెల్లవారు జామున కాటంవారిపల్లె గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పొలం పనుల కోసం వెళుతూ రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. నరసరావుపేట రైల్వే ఎస్ఐ శ్రీనివాస నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు రమణారెడ్డికి కుమారుడు ఉన్నాడు.

## రైతు సేవా కేంద్రాన్ని తనిఖీచేసిన ఏవో

ముండ్లమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమ చేయటం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం మండలంలోని పెదఉల్లగల్లులో రైతు సేవా కేంద్రంలో అర్హులైన అన్నదాత సుఖీభవ రైతులను పరిశీలించారు. మండలంలో 2025 సంవత్సరానికి గాను 21,789 ఖాతాలు ఉండగా, కేవలం 8,889 రైతుల ఖాతాలు మాత్రమే తనిఖీ జరిగినట్టు తెలిపారు. మిగిలిన రైతులందరూ తమ ఆధార్ నెంబరు, పొలం పాసు పుస్తకంతో రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్ళి వెబ్ ల్యాండ్‌ను, ఆధార్ లింకును చూసుకోవాలన్నారు. మే 29లోగా తనిఖీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏవో తెలిపారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన వేణుబాబు

తాళ్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబు గురువారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు వచ్చిన సందర్భంగా కొత్రపాటివారిపాలెంకు చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు కలిశారు. పార్టీ అభ్యున్నతికి తాను చేపట్టిన పనులను మంత్రి లోకేష్‌కు వివరించారు. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తనకు అవకాశం కల్పించా లని కోరారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, పరిశీలించి తగిన న్యాయం చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని వేణుబాబు తెలిపారు.

## 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

సీఎస్‌పురం(పామూరు), మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ తరుపున రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనలైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు ఏవో బి. సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెదరాజుపాలెంలలో గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడంవల్ల కలిగే ఉపయోగాల గురించి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ నేలలో అందుబాటులోలేని చాలరకాల పోషకాలు పచ్చిరొట్టతో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పొలాల్లో జీలుగు విత్తనాలు వేస్తే చౌడు విరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగులో పాటించవలసిన మెలకువల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పావలి శ్రీనివాసులు, గ్రామ ఉద్యాన సహాయకుడు అఖిల్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## కురిచేడులో భారీ వర్షం

కురిచేడు, మే 15(ఆంధ్రజ్యోతి): కురిచేడులో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గంటపాటు కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మురుగుకాలువలు పొంగి మురికినీరు రోడ్డుపై ప్రవహించింది. కురిచేడు, పడమరగంగవరం గ్రామాలలో ముదురు పొగాకు సాగుచేసిన రైతులు పొగాకు పందిళ్లలో పొగాకు ఆరబెట్టారు. ఈవర్షంతో పొగాకు తడిసిపోవడంతో రైతులు నష్టపోయారు.

## ప్రశాంతంగా జాతరను జరుపుకోవాలి

ముండ్లమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర గ్రామంలో వేంచేసి ఉన్న అంకాలమ్మ జాతర శుక్రవారం జరగనుంది. ఈసందర్భంగా ప్రభలు ఏర్పాటు చేసే బొప్పూడివారిపాలెం, భీమవరం గ్రామస్థులతో గురువారం సాయంత్రం దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. ముందుగా అంకాలమ్మ తల్లి, కాట్లంకమ్మ దేవాలయాలను సందర్శించి అక్కడ పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాతరలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కల్పించ కుండా ప్రశాంతంగా జరిగేందుకు నిర్వాహకులు కూడా సహకరించాలన్నారు. ప్రధానంగా ప్రభలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. ఈదర వాగు వద్ద ట్రాఫిక్ సమస్య పై ప్రత్యేకంగా ఎస్ఐ కమలాకర్‌తో చర్చించారు. దేవాలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉదయం 7 నుంచి రాత్రి 12 గంటల వరకు పోలీసు సిబ్బందిని ఉంచాలని ఎస్ఐకి సూచించారు.

# చిలకలేరుపై చప్టా పూర్తయ్యేనా..!

- 8 ఏళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్నరైతులు, ప్రజలు



తాళ్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం- పోలవరం రోడ్డు మార్గంలో చిలకలేరుపై రూ.2కోట్ల 40లక్షల నిధులతో చేపట్టిన చప్టా నిర్మాణపనులు 8 ఏళ్లుగా నిలిచిపోయాయి. దీంతో ఆమార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మండల శివారు గ్రామమైన విఠలాపురం నుంచి పోలవరం గ్రామం మీదుగా అద్దంకి రాకపోకలు సాగిస్తుంటారు. ఈమార్గంలోగల చిలకలేరులో నీటి ప్రవాహం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో ఆయా గ్రామస్థులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చప్టా నిర్మించాలని విన్నవించారు. అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎస్డీఎఫ్, ఎన్నార్జియస్‌ల కింద రూ.కోటి 20 లక్షలు మంజూరు చేయించారు. విఠలాపురం గ్రామపంచాయతీ వారు ఆనిధులతో 2017లో పనులు చేపట్టారు. వర్షాలు లేకపోవటంతో పనులు వేగవంతంగాసాగాయి. ఆనిధులతో పూర్తి స్థాయిలో పనులు పూర్తికావని మరో రూ.కోటి 20 లక్షలు మంజూరు చేయించారు. మొదటి విడతగా మంజూరైన నిధుల్లో ఎస్‌డీఎఫ్ కింద ఉపాధిహామీ పథకం కింద కోటి రూపాయల మేర పనులు జరిగాయి. ఆ నిధులతో చిలకలేరులో పనులు ప్రారంభించారు. చప్టా నిర్మాణకోసం పైపులు ఏర్పాటు చేసి, ఇరువైపులా గోడలు నిర్మించారు. వర్షాలు లేక పోవటంతో చప్టాకు పక్కన ప్రజలు, వాహన రాకపోకలకు అప్రోచ్‌ఏర్పాటు చేయటలేదు.

అయితే, పనులు జరుగుతున్న తరుణంలో 2019లో ఎన్నికలు రావటంతో పనులు నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు పూర్తిస్థాయిలో నిధులు విడుదలకాక కూలీలు ఇబ్బందులుపడుతున్నారు. రెండవ పర్యాయం మంజూరు చేసిన నిధులు గత వైసీపీ ప్రభుత్వంలో రావన్న కారణంతో పనులు చేపట్ట లేదు .గత 8 ఏళ్లగా చప్టా పనులు ముందుకు సాగక పోవటంలో చిలకలేరుపై రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పోయింది. అద్దంకికి దగ్గర మార్గంగా ఉండటంతో విఠలాపురం గ్రామానికి చెందిన ప్రజలు నిత్యం పోలవరం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చప్టా పక్కగుండా వెళ్లేందుకు రోడ్డు లేకపోవటం, చప్టా నిర్మాణం కోసం పైపులువేసి మిగిలిన పనులు పూర్తికాక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పోలంవరం గ్రామానికి చెందిన పశువుల కాపరులు, జీవాలపెంపకందార్లు చిలకలేరు దాటి అవతల గల

### పైపుల ఏర్పాటుకే పరిమితమైన చప్టా నిర్మాణం

పొలాలకు మేతకు వెళ్లాలి. అయితే, చప్టాపై వెళ్లేందుకు వీలులేక, వర్షాలు పడినప్పుడు ఉధృతంగా ప్రవహించే చిలకలేరు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విఠలాపురం గ్రామరైతులకు చెందిన కొందరి పొలాలు చిలకలేరు ఆవలివైపు ఉండటంతో వర్షాలు లేని సమయంలో చిలకలేరులో గుండా వెళుతుంటారు. వర్షాకాలంలో చిలకలేరు దాటేందుకు వీలులేక ముండ్లమూరు వెళ్లి పోలవరం గ్రామం మీదుగా చుట్టూతిరిగి వెళుతూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

ఇప్పటికైనా అధికారయంత్రాంగం స్పందించి చప్టా నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించి తమ ఇబ్బందులను తొలగించాలని విఠలాపురం, పోలవరం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని శంఖవరం గ్రామం వద్ద జరుగుతున్న సాగర్ నీటి పైపుల మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత పదేళ్ళుగా సాగర్ నీటిసరఫరా పైపులు మరమ్మతులకు గురై తరచూ నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. మరమ్మతులకు గురైన పైపుల స్థానంలో నాణ్యమైన పైపులు, సామగ్రిని వినియోగించాలని నీటి సరఫరా శాఖాధికారులు, సిబ్బందికి సూచించారు. రోడ్డు వెంట వేస్తున్న నీటి సరఫరా పైపులు వాహనాలవల్ల ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా లోతుగా వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


పైపుల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

# నేడు అంకాలమ్మ జాతర

ముండ్లమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీఅష్టపద్మాల అంకాలమ్మ, కాట్ల అంకమ్మ 300వ జాతర మహోత్సవం శుక్రవారం జరగనున్నది. జాతరకు మూడు రోజులు ముందుగా అమ్మవారిని ఘనసాల వంశస్థులు తమ ఆడ బిడ్డగా భావించి ఇంటికి తీసుకువచ్చి పసుపు, కుంకుమతో పాటు చీర, చార పెట్టి ఊరేగింపుగా నాగమల్లి వంశస్థులకు కోడలుగా అప్పజెప్పి రావటం కొన్ని వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ జాతరకు మండలంలోని పలు గ్రామాలతో పాటు జిల్లాలోని పలు మండలాల నుంచి పెద్ద ఎత్తున


అంకాలమ్మ అమ్మవారి మూలవిరాట్

భక్తులు వస్తారు. జాతర సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. మొక్కుబడులు ఉన్న భక్తులు రెండు రోజులు ముందుగానే గ్రామానికి చేరుకొని పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పిస్తారు.

జాతర సందర్భంగా బొప్పూడివారిపాలెం, భీమవరం గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయులు రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి సీఐ వై రామారావు పర్యవేక్షణలో ఎస్ఐ కె.కమలాకర్‌తో పాటు నలుగురు ఎస్ఐలు, 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.


జాతరకు ముస్తాబైన ఈదర అంకాలమ్మ దేవాలయం

# ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

- మొక్కుబడిగా స్వచ్ఛ కార్యక్రమాలు
- పట్టించుకోని అధికారులు

పామూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ పాలథిన్ సంచుల నిషేదం అమల్లో ఉన్నా అధికారుల ఉదాసీనతతో పర్యావరణానికి ముప్పు వాటిల్లితుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలిథిన్ వస్తువుల వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. ఇవి భూమిలో కరగకపోవడంతో భూసారం దెబ్బతినడం, భూగర్భ జలమట్టం అడుగంటడం జరుగుతుంది. మురుగు కాలువల్లో పాలిథిన్ సంచులు, గ్లాసులు చేరడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

ముఖ్యంగా పాలిథిన్ సంచుల్లో తీసుకెళ్లే ఆహార పదార్థాలు అనారోగ్యానికి కారణమవుతున్నాయి. పాలథిన్ సంచులు చెత్తలో పడేటయం వలన వాటిని తినే ఆవులు, గేదెలు, మూగజీవాలు వ్యాధుల బారినపడుతున్నాయి. ప్లాస్టిక్‌ను నియంత్రించెందుకు ఎన్ని చట్టాలు చేసినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నాయే తప్ప వాటిని అమలుపరచడంలో వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు వెల్లుతున్నాయి.

ప్లాస్టిక్ నిషేదం అమలులో భాగంగా ప్రభుత్వాలు అనేక స్వచ్ఛ కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయితే, క్షేత్ర స్థాయిలో అధికారులు ఆదిశగా అడుగులు వేయడం లేదు. ఉన్నాతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక ప్రత్యేక కార్యక్రమాల రోజుల్లో హడావిడి చేసే అధికారులు మొక్కుబడి కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతున్నది. ప్రధాన కూడళ్ల, దుకాణాల సముదాయాలు, నివాసాల


రోడ్డుపై పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నుంచి సేకరించే చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయి. దుకాణాల్లో వీటిని వినియోగిస్తున్నప్పటికీ అడ్డుకొనే నాధుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


చెరువులో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

# మాధవరంలో పిచ్చికుక్క స్వైరవిహారం

తాళ్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది. ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారులను, పెద్దలను, మహిళలను గాయపరిచింది. సాయి అనే బాలుడిని తీవ్రంగా గాయ పరిచింది. ఆ చిన్నారి కేకలు వేస్తుండటంతో పెద్దలు గమనించి ఆకుక్కను తరిమికొట్టి కాపాడారు. ఆతర్వాత మరో బాలిక శ్రీలక్ష్మిని గాయపరిచింది. గ్రామంలో తిరుగుతూ పలువురిని గాయపర్చింది.

తీవ్రంగా గాయపడిని చిన్నారులను తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించారు. సాయి అనే బాలుడిని మెరుగైన చికిత్స కోసం108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ తాటికొండ శ్రీను వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.


తీవ్రంగా గాయపడ్డ బాలుడు


దేవతా విగ్రహాలకు పాలభిషేకం చేస్తున్న గ్రామస్థులు

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

దొనకొండ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు రెండోరోజు గురువారం గ్రామస్థుల సహకారంతో వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు రెంటచింతల సత్యనారాయణశర్మ, బద్వేలుకు చెందిన వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి హోమాలు, వాస్తు హోమం, చండీ హోమం, తదితర హోమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవతల విగ్రహాలకు పాలభిషేకం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంతో పాటు పరిసరాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ వేడుకలతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

## ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ

ముండ్లమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను లబ్ధిదారులకు చేర్చేవిధంగా అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి పి.వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలకు నోచుకోని అర్హులుంటే వారి జాబితా తయారుచేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఏగ్రామంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.సునీత, పంచాయతీ రాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఏపీవో టి.వెంకటరావు, ఏపీఎం ఎం.హనుమంతరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో నరసింహబాబు

పామూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5 నుంచి జరుగనున్న శ్రీమదనవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈవో నరసింహాబాబు తెలిపారు. ఇందుకుసంబంధించి గురువారం కాపు ఉభయ దాతలతో గురువారం ఈవో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 5 నుంచి 13వ తుదీవరకు స్వామివార్ల బ్రహ్మోత్సవాల నిర్వహణపై కులాల వారీగా చర్చిస్తున్నట్టు చెప్పారు. బ్రాహ్మణ సంఘం సభ్యులతో కూడా చర్చించామన్నారు. శుక్రవారం నాయీబ్రాహ్మణులతో, రెడ్డి, ఆరే కాపులు, కమ్మ, ముదిరాజు, వాల్మీకి, బెస్తవారు, ఆర్య వైశ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 17 సంవత్సరాలు అనంతరం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఈవో కోరారు.

సమావేశంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఎంపీటీసీ ఆకుపాటి రమణయ్య, దేవస్థాన మాజీ చైర్మన్లు గుత్తిరాజ, గుర్రం వెంకటేశ్వర్లు, నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, వాయునేని మాల్యాద్రి, బండ్ల నారాయణ, కటకం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి కళాపరిషత్ పోటీలు

దర్శి, మే 15(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో శుక్రవారం నుంచి జాతీయస్థాయి దక్షణాపురి నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలవకొలను అనంత్ తెలిపారు.

ఈ పోటీలు స్థానిక ప్రభుత్వ జూనియ ర్ కళాశాల ఆవరణలో మూడు రోజులు పాటు జరుగుతాయన్నారు. వీటిల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 16 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

| 16-5-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 40 | 27 |
| తెనాలి | 39 | 28 |
| నరసరావుపేట | 38 | 27 |
| బాపట్ల | 38 | 28 |
| రెంటచింతల | 38 | 26 |
| చీరాల | 38 | 28 |

# టీడీపీలో.. మినీ కోలాహలం

- 18 నుంచి నియోజకవర్గాల్లో నిర్వహణ
- స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు
- 22, 23 తేదీల్లో ఒక రోజు జిల్లా స్థాయి మహానాడు
- తుది దశలో సంస్థాగత ఎన్నికలు.. 23 కల్లా జిల్లా అధ్యక్షుల ప్రకటన


బాపట్లలోని టీడీపీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో మహా సందడి మొదలైంది. ఒకవైపు కడపలో మహానాడు పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతుండగా.. అందుకు సన్నాహకంగా నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులకు ఎక్కడికక్కడ స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో తమ్ముళ్లలో మినీ మహానాడుల కోలాహలం నెలకొంది. ఒకవైపు మహాపండుగలా మహానాడును నిర్వహించేందుకు పార్టీ అధినాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కూడా మహానాడుల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు తరలివెళ్లేందుకు శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర మహానాడుకు సన్నద్ధతగా నియోజకవర్గాల్లో మహానాడుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర మహానాడుకు ముందుగా ఈ నెల 18 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహానాడులను నిర్వహించనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడుల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మినీ మహానా డులకు సంబంధించి తేదీలను కూడా ప్రకటించారు. మినీ మహానాడులలో ఆయా నియోజకవర్గాల పరిధిలో నెల కొన్న సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను చేస్తారు. వీటిని రాష్ట్ర మహానాడుకు నివేదిస్తారు. మినీ మహానాడుల అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో ఏదో ఒక రోజు జిల్లా మహానాడు నిర్వహిస్తారు. దీనికి ముందే పార్టీ జిల్లా కొత్త అధ్యక్షుడ్ని రాష్ట్ర పార్టీ నియమిస్తుంది. కొత్త అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లా మహానాడు జరుపుతారు.

### మొదలైన సంస్థాగత సందడి

నియోజకవర్గాల్లో నిర్వహించే మహానాడుల కంటే ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేస్తారు. ఇప్పటికే గ్రామ, వార్డు, డివిజన్ స్థాయిలో ఈ ఎన్నికల ప్రక్రియ తుది దశలో ఉంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ కమిటీలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. రెండో దశలో ఈ నెల 18లోగా నగర, పట్టణ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల బాధ్యు ల నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి అధిష్ఠానం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పరిశీలకులను ప్రత్యేకంగా నియమించింది. ఎన్నికల్లో పార్టీ కోసం పాటు పడిన వారికి అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బూత్, క్లస్టర్ స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న వారికి పదవులు కేటాయించనున్నారు. ఆయా పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఎంపిక కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు తల నొప్పిగా మారింది.

# పుర పాఠశాలలకు.. పోస్టులు



గుంటూరు : మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- అవసరమైన పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 190కిపైగా ఎస్‌ఏలు
- ఉన్నత పాఠశాలలకు ఇక పూర్తిస్థాయి హెచ్ఎంలు
- మున్సిపాల్టీల్లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీకి ఆమోదం

గుంటూరు (విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత కొన్నేళ్లగా మెరుగైన ఫలితాలతో మున్సిపల్ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు పోటీ పడుతున్నాయి. అయితే ఉపాధ్యాయుల కొరతతో మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటిదాకా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులతో నెట్టుకొస్తున్న పాఠశాలలకు ఇక పూర్తిస్థాయిలో హెచ్ఎంలు రానున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో దాదాపు 17 ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13 మున్సిపాలిటీలు, గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 150 పైగా ఉన్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యా వలంటీర్లు లేదంటే ప్రాథమిక పాఠశాలల నుంచి ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై నియమించి విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. గుంటూరులో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా పూర్తిస్థాయి హెచ్ఎంలు లేరు. మరోవైపు పీఈటీల కొరత కూడా మున్సిపల్ పాఠశాలలను వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏటా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించేందుకు ఉపాధ్యాయులను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది అవసరమైన చోట ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తి స్థాయిలో నియమించుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ టూ హెచ్ఎం పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 9 మందికిపైగా పూర్తిస్థాయి హెచ్ఎంలు రానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 190కి పైగా స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పోస్టులు భర్తీ కానున్నాయి. అవసరమైన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. త్వరలో షెడ్యూల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

### విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవ..

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నారా లోకేశ్ తాను ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుల కొరత గురించి స్వయంగా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల భర్తీకి ఆయన చొరవ చూపినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హైమారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దాదాపు 2000పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు మంజూరు చేశారన్నారు.

# నాణ్యత లేకుంటే అధికారులపై చర్యలు

- నిర్వహణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రతి రెండు కిలోమీటర్లకు ఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలి
- నీటిపారుదల పనుల సమీక్షలో కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలోని పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆపరేషన్ అండ్ నిర్వహణ పనులపై కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆపరేషన్ అండ్ నిర్వహణ కింద 454 పనులకు రూ.12.59 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 10నే నీటిని నిలిపేసినందున కాల్వల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాలు ముందుగా వచ్చే పరిస్థితి ఉన్నందున పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయా పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. పనులకు సంబంధించి ప్రతిరెండు కిలోమీటర్లకు ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలని, వారిపై పర్యవేక్షకులుగా ఏఈలను నియమించాలన్నారు. కట్టలకు ఎక్కడ గండిపడితే అక్కడ విధులు నిర్వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పనుల పరిశీలనకు ప్రత్యేకంగా కమిటీని నియమిస్తామని, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఏడాది సెప్టెంబరులో కేటాయించిన పనులు ఇంకా పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలాఖరులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ పి.వెంకటరత్నం, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఈఈలు ఎం.ప్రేమ్‌కుమార్, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వేమూరులో 17న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

జిల్లాస్థాయిలో ఈ నెల 17న వేమూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వేడిని తట్టుకోవడం అనే అంశంపై కార్యక్రమం జరుగుతుందన్నారు.


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి


నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం

# ఆర్థిక స్వేచ్ఛ.. ఎప్పటికో?

- జీతాలు, బిల్లుల చెల్లింపులో జాప్యం
- మార్గదర్శకాల్లోనే మున్సిపాల్టీలకు అధికారాలు
- ఇప్పటికీ పాత పద్ధతిలోనే ఆర్థిక లావాదేవీలు
- రూపాయి ఖర్చుకు కూడా అనుమతి కోసం ఎదురుచూపు
- సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీల్లో ఆర్థిక వెతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు ఉన్నా.. మున్సిపాల్టీల్లో ఖర్చు చేసుకునే వెసులుబాటు లేదు. అత్యవసర పనులకు సైతం బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. ప్రజలు నుంచి ఆస్తి, నీటి, ప్రకటనల పన్నులను షాపింగ్ కాంప్లెక్సు లీజుల ద్వారా వచ్చే ఆదాయాలను మున్సిపాలిటీలు వసూలు చేస్తున్నా.. ఆ మొత్తాలపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదే. పేరుకు పురపాలక సంఘం.. ప్రత్యేక పాలనా వ్యవస్థ ఉన్నా.. ఆర్థిక స్వేచ్ఛ మాత్రం లేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఉద్యోగులకు జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించే పరిస్థితి నెలకొంది. మున్సిపాల్టీలకు అధికారాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే నెలలు గడుస్తున్నా ఈ మార్గదర్శకాలు అమల్లోకి రాలేదు. సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీలు ఆర్థిక వెతలను ఎదుర్కొంటున్నాయి. పంచాయతీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించింది. దీంతో ప్రజలు చెల్లించే పన్ను, వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ అజమాయిషీ లేకుండా అభివృద్ధి పనులకు వినియోగించుకునే అధికారం పంచాయతీలకు వచ్చింది. ఈ పరిస్థితి మున్సిపాల్టీలకు లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రతి బిల్లు అప్‌లోడ్ చేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తేనే సీఎఫ్ఎంఎస్‌లో ఆ బిల్లు పాసవుతుంది. ఈ ప్రక్రియ అమలులో జాప్యం జరుగుతోంది. మున్సిపాల్టీల్లో అత్యవసర పరిస్థితుల్లో తాగునీరు, పారిశుధ్య పనులు చేయాల్సి వస్తుంది. ఇందుకు సంబంధించి బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీలను తప్పించేందుకు పలు ఆర్థికపరమైన అనుమతులు కావాలని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆర్థిక పరమైన స్వేచ్ఛ కోసం మున్సిపాల్టీలు మరికొంత సమయం వేచి ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీ లకు విముక్తి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని పురపాలకులు కోరుతున్నారు.



# ఆర్టీఈలో.. 1904 సీట్లు

### 740 నమోదు.. 1155 మందికి అవకాశం

### ఈ నెల 19వ తేదీతో ముగియనున్న గడువు

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) కింద జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 1904 సీట్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 225 ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఆర్టీఈ ద్వారా 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలి. అయితే ఈ ఏడాది 1వ తరగతిలో చేరేవారు ఇప్పటి వరకు 740 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆర్టీఈ ప్రవేశాల నమోదుకు అవకాశం ఉందని, దీనిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మర్రెడ్డి నాగిరెడ్డి తెలిపారు. ఉచిత సీటు పొందేందుకు తల్లిదండ్రులు సమీప పాఠశాలలో రిజిష్టర్ చేసుకోవాలని కోరారు. ఇంకా 1155 ఉచిత సీట్లు ఉన్నట్లు తెలిపారు.

| మండలం | స్కూల్స్ | సీట్లు | నమోదు |
|---|---|---|---|
| అద్దంకి | 17 | 135 | 78 |
| అమర్తలూరు | 3 | 24 | 10 |
| బాపట్ల | 32 | 233 | 78 |
| భట్టిప్రోలు | 7 | 75 | 42 |
| చెరుకుపల్లి | 10 | 74 | 4 |
| చినగంజాం | 4 | 28 | 17 |
| చీరాల | 35 | 300 | 151 |
| ఇంకొల్లు | 8 | 88 | 32 |
| జెపంగులూరు | 2 | 2 | 7 |
| కారంచేడు | 1 | 9 | 5 |
| కర్లపాలెం | 3 | 45 | 23 |
| కొల్లూరు | 6 | 51 | 8 |
| కొరిశపాడు | 7 | 144 | 6 |
| మార్టూరు | 8 | 108 | 28 |
| నగరం | 4 | 28 | 0 |
| నిజాంపట్నం | 7 | 55 | 16 |
| పర్చూరు | 6 | 70 | 5 |
| పిట్టలవానిపాలెం | 9 | 56 | 16 |
| రేపల్లె | 21 | 169 | 183 |
| సంతమాగులూరు | 7 | 65 | 7 |
| చుండూరు | 5 | 31 | 7 |
| వేమూరు | 7 | 32 | 10 |
| వేటపాలెం | 15 | 82 | 27 |

# నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18.50 కోట్ల పెట్ స్కాన్

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక పెట్ స్కాన్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.18.50 కోట్లు. పలు రకాల క్యాన్సర్ వ్యాధుల చికిత్సలో, వ్యాధి నిర్ధారణలో ఈ పరికరం ఎంతో కీలకం. రాష్ట్ర ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రికి పెట్ స్కాన్‌ను అందజేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ఈ పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి చేసి మరో నెల రోజుల్లో రోగులకు అందుబాటులోకి తెస్తామని జీజీహెచ్ అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రైవేటు క్యాన్సర్ హాస్పిటల్స్‌లో పెట్ స్కాన్‌కు రూ.25 వేలు, పేదలకు కన్‌సెషన్ కింద కనిష్ఠంగా రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చారిటీ ఆసుపత్రుల్లో రూ.8 వేలకు ఈ పరీక్ష చేస్తున్నారు. జీజీహెచ్‌లో పెట్ స్కాన్ పరీక్షలు ఉచితమా? నామమాత్రపు రుసుం తీసుకుంటారా అనేదానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.


నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ స్కాన్

# సోలార్ ప్లాంట్ సెజ్‌కు సన్నాహాలు

- భూసేకరణ కోసం నేడు రైతులతో సమావేశం
- సంతమాగులూరు, బల్లికురవలో భూముల పరిశీలన


ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో భూసేకరణ చేయనున్న భూములు

అద్దంకి/బల్లికురవ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ప్లాంట్ సెజ్‌ను జిల్లాలో ఏర్పాటుకు సన్నా హాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సంతమాగులూరు మండలం కుందుర్తి, మామిళ్లపల్లి రెవెన్యూ పరిధిలో 1269 ఎకరాలు, బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు రెవెన్యూ పరిధిలో 350 ఎకరాల భూమిని అధికారులు పరిశీలన చేశారు. ఆయా భూములకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ధరను బట్టి రైతులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కొంత భూమికి నీటి వసతి ఉండటంతో ఆయా భూముల రైతులు ఎక్కువ ధరను ఆశిస్తున్న ట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆయా గ్రామాల ప్రజలకు కాలుష్యంపై అపోహలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు కుందుర్తి, మామిళ్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడులలో రైతులతో అవగాహన సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలలో రైతులకు సమాచారం ఇచ్చి, దండోరా కూడా వేయించారు. సెజ్ ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయని యువత ఉత్సాహంగా ఉంది. అయితే భూమి కోల్పోతున్నందున బహిరంగ మార్కెట్ కంటే ఒకింత ఎక్కువ ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. భూమి ఇచ్చేందుకు రైతులు ఇష్టపడి భూసేకరణ అడుగు ముందుకు పడితే రాష్ట్రంలోనే మొదటి సోలార్ ప్లాంట్‌కు అవసరమైన మెటీరియల్ స్థానికంగానే తయారు కావడంతో పాటు భారీ పరిశ్రమ ఏర్పాటు జరిగే అవకాశం ఉంది.

# నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

చిలకలూరిపేట, మే15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ సంయుక్తంగా శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సీఆర్ క్లబ్ కళా వేదికను సిద్ధం చేశారు. రాత్రి నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యవభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమాలలో స్థానిక సీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి కాంతయ్య, పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు పాల్గొంటారు.



నాటిక పోటీలకు సిద్ధమైన వేదిక

# బాబోయ్ వడగాల్పులు

- వారం వ్యవధిలో నియోజకవర్గంలో వడదెబ్బకు పదిమంది మృతి
- జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచనలు


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : పదిరోజులుగా వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రత తీవ్రత పెరుగుతుంది. వడగాలులు సైతం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో సుమారు 10 వరకు మరణాలు నమోదయ్యాయి. గత వారం నుండి రోజు 39 - 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవు తోంది. దీంతో చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంకు చెందిన ఉపాధి కూలీ పేర్లి ప్రకాశరావు(54) ఉపాధి పనిచేస్తూనే అక్కడే కుప్ప కూలాడు. అలాగే వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలో కంకిపాటి వల్లీకుమారి(64) గత మంగళ వారం బయటకు వెళ్లి వచ్చి ఇంట్లో అలసట తీరేందుకు ఏర్పాట్లు చేసుకొంటూ మృతి చెందింది. ఇలా చీరాల నియోజకవర్గంలో ఇంచుమించు పదిమంది మృతిచెందారు. ఈ విధంగా వరుస మరణాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏది ఏమయినా అధికారులు మాత్రం ఈదురు గాలులు, వడగాలులకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తు న్నారు. అంతేకాకుండా ఎండ సమయంలో బయ టకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**వడదెబ్బ లక్షణాలు..**

వడదెబ్బ తగిలనప్పుడు వారికి చర్మం పొడి బారు తుంది. శరీరం నుండి వెచ్చని ఆవిరి వస్తుంది. వాంతులు అవుతాయి. తలనొప్పి అధికంగా ఉంటుంది. అలాగే కండరాలు నొప్పులు ఉంటాయి. శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయి. తల తిరుగుతుంటుంది.

**సమస్యకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఎండ సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు కచ్చితంగా టోపీ ధరించాలి. తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి. సాధ్యమయినంత వరకు ఇంట్లోనే ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీరు తాగవచ్చును. నిమ్మరసం తీసుకోవడం ఆరోగ్యం. ఇంటి సరిసరాలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. మొక్కలు ఇంటి పరిసరాల్లో ఉండేలా చూసుకోవాలి.

**తేడాలు గమనిస్తే వైద్య సాయం పొందాలి -**

శరీరంలో రోజువారీకు భిన్నంగా తేడాలు గమనిస్తే వైద్యులను సంప్రదించడం మంచిది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తు న్నారు. ఎదయినా సమస్యలు గుర్తిస్తే వైద్యం అందిస్తున్నాము. వడ గాలులు పట్ల జాగ్రత్తలు పాటించడం ఉత్తమం.

**డా.స్వాతికిరణ్, వైద్యాధికారి వేటపాలెం పీహెచ్‌సీ**

# షరా.. మామూలే!

ఒంగోలులోని చెన్నకేశవ స్వామిపేటకు చెందిన ఓ చిరు వ్యాపారికి రెండేళ్ల క్రితం వివాహమైంది. తల్లిదండ్రుల నుంచి వేరుపడి భార్యా పిల్లలతో కలిసి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సచివాలయ సిబ్బంది మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని చెప్పడంతో ఆయన బుధవారం రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్లాడు. అక్కడ సిబ్బంది సర్టిఫికెట్‌కు రూ. 4వేలు డిమాండ్ చేయడంతో అవాక్కయ్యాడు.

నాలుగు రోజులుగా వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో ఒంగోలులోని జీజీహెచ్ కిక్కిరిసిపోతోంది. దంత పరీక్షలు చేయించుకుని వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్ కోసం రావడంతో ఆసుపత్రిలోని డెంటల్ డాక్టర్ వారితో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు అని అడిగారు. యర్రగొండపాలెం, మార్కాపురం, కంభం ప్రాంతాల నుంచి వచ్చామని చెప్పారు. 'అక్కడ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ వైద్యులు సర్టిఫికెట్‌లు ఇస్తారు కదా? ఇంత దూరం ఎందుకు వచ్చారు' అని వైద్యుడు అడిగారు. 'మా ఏరియాలో డాక్టర్‌లు మేము ఇవ్వకూడదు. ఒంగోలు వెళ్లి తీసుకోవాలి అని చెప్పడంతో ఇక్కడికి వచ్చాం సార్' అని బదులిచ్చారు.

## సర్టిఫికెట్లు ఇవ్వడంలోనూ పైసలు పిండుతున్న అధికారులు

## కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారుల అవస్థలు


ఒంగోలులోని జీజీహెచ్‌లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు



- వయస్సు ధ్రువీకరణ పత్రం పొందాలన్నా తిప్పలే
- ప్రభుత్వ వైద్యశాలల్లో నిరక్షరాస్యులకు సర్టిఫికెట్ ఇవ్వని వైద్యులు
- ఒంగోలు జీజీహెచ్‌కు పరుగులు తీస్తున్న లబ్ధిదారులు

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్టుంది' కొత్త రేషన్ కార్డు దరఖాస్తుదారుల దుస్థితి. పేద కుటుంబాలకు కొండంత అండ రేషన్ కార్డు. సంక్షేమ పథకాలు పొందాలన్నా ఇదే గీటురాయి. నూతన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు కూడా కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. దరఖాస్తుతో జత చేయాల్సిన పత్రాలు సేకరించడం మాత్రం లబ్ధిదారులకు సముద్రం ఈదినంత పని అవుతోంది. కీలకమైన మ్యారేజ్ సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు పొందడం అర్హులకు తలకు మించిన భారం అవుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారు. నిరక్షరాస్యుల వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం ప్రభుత్వ ఆసుపత్రికెళితే దంత వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో బిక్కముహం వేస్తున్నారు.

**మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.4వేలు వసూలు**

వివాహమై ఇంతవరకు రేషన్ కార్డు లేనివారు కొత్త రేషన్ కార్డు పొందాలంటే కచ్చితంగా మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అర్జీదారులు పరుగులు పెడుతున్నారు. సాధారణ రోజుల్లోనే పలు భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌ల విషయంలో రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే అవినీతికి కేరాఫ్‌గా అందరు భావిస్తారు. తాజాగా మ్యారేజ్ సర్టిఫికెట్‌ల మంజూరు అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులకు మరింతగా కలిసొచ్చింది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డు పొందాలంటే అందుకు అవసరమయ్యే పత్రాలకు వేలకు వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఒంగోలు, కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈనెల 8 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. అయితే అందుకు అర్హత ప్రమాణాలు, అవసరమైన డాక్యుమెంట్‌లు సమర్పించాలని పేర్కొంది. అర్జీదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.2 లక్షలలోపు ఉండటంతోపాటు, ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలని స్పష్టం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో నమోదు కావడంతోపాటు, కుటుంబ సభ్యుల్లో ఎవరికీ రైస్ కార్డు ఉండకూడదని పేర్కొంది. ఆధార్ కార్డు, వివాహ ధ్రువీకరణకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్, పెండ్లి ఫొటోలు తప్పనిసరి చేసింది. నిరక్షరాసులకు వయస్సు ధ్రువీకరణ పత్రం తీవ్ర సమస్యగా మారింది. అర్జీదారులు ఆయా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

**వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలుకు..**

చదువుకున్న వారికి విద్యార్హత సర్టిఫికెట్‌లలో నమోదు అయ్యే డేట్ ఆఫ్ బర్త్ సరిపోతుండగా, నిరక్ష్యరాస్యులకు డెంటల్ డాక్టర్లు నిర్ధారించాల్సి ఉంది. దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యులు జ్ఞానదంతాలను పరీక్షించి, వాటి ఆధారంగా, మేజర్, మైనర్‌గా వయస్సును నిర్ధారిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ డాక్టర్లు సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడంతో జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులు వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలులోని జీజీహెచ్‌కు బారులు తీరుతున్నారు. జిల్లాలోని పశ్చిమప్రాంతం మార్కాపురం, వై.పాలెం, పెదారవీడు, కంభం, గిద్దలూరు, బేస్తవారపేట వంటి దూరప్రాంతాల నుంచి జీజీహెచ్‌కు వస్తున్నారు. దీంతో ఇక్కడి వైద్యులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా పొందవచ్చని, ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని వివరిస్తున్నారు. అయితే జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో అర్జీదారులు నానాఅగచాట్లు పడుతున్నారు.

# హంతకులను కఠినంగా శిక్షిస్తాం

- వీరయ్య చౌదరి కుటుంబానికి అండగా నేనున్నా
- అమ్మనబ్రోలులో మంత్రి లోకేష్


వీరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లోకేష్

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'వీరయ్య చౌదరిని హత్య చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. వారిని కఠినంగా శిక్షిస్తాం. వీరయ్య కుటుంబానికి నేను అండగా ఉంటాను' అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో దారుణ హత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబసభ్యులను అమ్మనబ్రోలులోని ఆయన స్వగృహంలో మంత్రి లోకేష్ పరామర్శించారు. తొలుత వీరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వీరయ్య సతీమణి సుచిత్ర, తనయుడు చంద్ర సిద్ధార్థలను లోకేష్ ఓదార్చి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వీరయ్య అన్నారు. యువగళం పాదయాత్రలో వంద రోజుల పాటు వెన్నంటే ఉండి తనతో అడుగులు వేశారని గుర్తు చేసుకొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకొన్న వీరయ్య రాజకీయంగా ఎదుగుతున్న సమయంలో హత్యకు గురి కావడం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు.

వీరయ్య హత్య కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసి నిందితులు ఎంతటి వారైనా, ఎక్కడున్నా పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ వీరయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరరావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ మంత్రి బాచిన చెంచు గరటయ్య ఉన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గింపు


ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సన్మానిస్తున్న ఏడీఏ

యద్దనపూడి,(మార్టూరు)మే15(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా వ్యవసాయంలో సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చునని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. గురువారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయశాఖ, వెలుగు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, నవధాన్యాలు సాగు విషయం, కేపీపీ గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.మేరమ్మ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోయపాటి సాంబ శివరావు, వీఆర్‌వో వసంతరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజా, హరీష్, వినయ్ వెలుగు సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

**కౌలురైతు గుర్తింపు కార్డులపై అవగాహన**

బోడవాడ(పర్చూరు): పర్చూరు మండలం బోడవాడ గ్రామంలో గురువారం కౌలు రైతు కార్డుల సాగు గుర్తింపుపై ఏడీఏ మోహనరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కౌలు రైతులను గుర్తించి వారికి కార్డులను మంజూరు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు. దీనిలో భాగంగా అర్హులైన ప్రతి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్ రెడ్డి గ్రామ సర్పంచ్ కన్నెగంటి సాంబయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాతిమండప నిర్మాణానికి విరాళం



విరాళాలు అందజేస్తున్న సింగమ్మ, శ్రీహరిరావులు

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతిముఖ మండపం నిర్మాణానికి అద్దంకికి చెందిన చిన్ని శ్రీహరిరావు, ఉమాదేవి దంపతులు రూ.1,01,116, కాకానిపాలెం మాదాల శింగమ్మ రూ.1,01,116లను గురువారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. వారివెంట సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 18న టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

- ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో నిర్వహణ

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు వేదిక కానుంది. స్థానిక వైజంక్షన్ సమీపంలోని రిగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణంలో ఈనెల 18న పర్చూరు క్రికెట్ క్లబ్ సౌజన్యంతో పోటీలు జరగనున్నాయి. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.35వేలు, మూడవ బహుమతి రూ.25వేలు, నాల్గవ బహుమతి రూ.15లతోపాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తోట మణి తెలిపారు. వివరాలకు 9493515155, 7993090964 నంబర్లను సంప్రదించాలన్నారు.

## అడుసుమల్లిలో చోరీ

అడుసుమల్లి(పర్చూరు), మే 15 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం అడుసుమల్లిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. అడుసుమల్లి ఎస్సీ కాలనీలోని రేగులగడ్డ సత్యవతి ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న రూ.15 నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదుపై గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. చేపట్టిన పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి ఉండటంతో పాటు పని ప్రదేశంలో తాగునీరు, నీడ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గురువారం మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు సకాలంలో వారి ఖాతాల్లో కూలి డబ్బులు పడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇనమనమెళ్లూరు ఫీల్డ్ చానల్‌ను కలెక్టర్ పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు దినసరి కూలి రూ.300 దక్కేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులు ఉదయం 6 నుంచి 11 గంటలోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌వరప్రసాద్, తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్వామి వారి కల్యాణం మరుసటి రోజున ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, హోమం నిర్వహించారు. అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో వసంత సేవ నిర్వహించారు. భక్తులు వసంతం, రంగులు చల్లుకొని కోలాహలంగా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు. ఈవో రామకృష్ణారావు, చైర్మన్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అశ్వవాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం కొలచనకోట గ్రామంలో అ శ్వవాహనంపై విహరించారు. ఉభయదాతలు మోపర్తి సుబ్బారావు, మోపర్తి సందీప్‌చౌదరి, ఘంట సింగయ్య, జి.చిన్నఅబ్బయ్యచౌదరి, మోపర్తి చెంచురామ య్య, గుండ్లాపల్లి వెంకటకృష్ణయ్య, మోపర్తి గోపీనాథ్, గంట సుబ్బారావులు వ్యవహరించారు. కళ్యాణం అనంతరం స్వామివారు గ్రామానికి రావటం ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా నాయబ్‌రసూల్

ఒంగోలు(రూరల్), మే15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూర ల్ మండల తహసీల్దార్‌గా నా యబ్‌రసూల్ నియమితుల య్యారు. గురువారం ఒంగోలు లోని తహసీల్దార్ కార్యాలయం లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, వీ ఆర్వో రామకృష్ణ, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పని చేసినా కూలి రాదాయే!

**ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇవ్వాలని హుకుం**

- అంగీకరించని 5 పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత
- వేతనం అందక కూలీల అవస్థలు
- పెద్దారవీడు మండలంలో 'ఉపాధి' సిత్రమిదీ..


పెద్దారవీడులో ఉపాధి కూలీలు

పెద్దారవీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): పనిచేసినా కూలి రాని పరిస్థితి పెద్దారవీడు మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో నెలకొంది. ఉపాధి కూలీలంతా ప్రతిరోజూ పనిచేస్తున్నారు. అందుకు సంబంధించిన మస్టర్లను మేట్లు సిద్ధం చేస్తున్నారు. కానీ చేసిన పనులకు సంబంధించి ఆన్‌లైన్ చేయడంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి కూలీలు చేసే పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన మండల, గ్రామస్థాయి అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి మండలంలో నెలకొంది.

**వారానికి రూ.200 వసూలు**

'ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి పనులకు వచ్చి పనిచేయనీ, చేయకపోనీ.. ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇస్తే మస్టర్లలో పేరు నమోదు చేస్తాం. లేకపోతే మీ పేర్లు గల్లంతే' అంటూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేసినట్లు, దీనికి 14 పంచాయతీల్లోని ఉపాధి హామీ కూలీలు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు సంబంధించి కూలీల వద్ద నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.200 వసూలు చేసి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించే మండల స్థాయి అధికారికి ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది.

**ఐదు పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత**

మండలంలోని ఐదు పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి హామీ పనులకు మస్టర్లు నమోదు చేయడంలో జాప్యం జరిగింది. మండల స్థాయి అధికారులు సూచించిన వారానికి రూ.200 వసూలు ప్రతిపాదన అమలుకాకపోవడమే ఇందుకు కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని పెద్దారవీడు, బద్వీటి చెర్లోపల్లి, చట్లమిట్ట, బోయలదుంపల, సానికవరం పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి పనులకు మస్టర్లు నమోదు కాలేదు. ఈ విషయమై మండలస్థాయి అధికారులను వివరణ కోరితే సర్వర్ సమస్య అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానంపై నెపం మోపుతున్నారు.

**2000 మంది కూలీల వేతనాలు నిలిపివేత**

మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో 2000 మంది ఉపాధి కూలీలకు వేతనాలను నిలిపివేశారు. పెద్దారవీడులో సుమారు 400, బద్వీటి చెర్లోపల్లిలో 500, చట్లమిట్టలో 400, బోయలదుంపలలో 300, సానికవరంలో 400 మందికి పని చేసినా వేతనం ప్రభుత్వం నుంచి పొందలేని పరిస్థితి నెలకొంది.

**జరిగిన తప్పులను సరిదిద్దుతాం**

మండలంలోని ఐదు పంచాయతీలలో మస్టర్లు నమోదు చేయకపోవడం వాస్తవమే. తాము డబ్బులు వసూలు చేయమని చెప్పామనడం నిజం కాదు. క్షేత స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

**- సుజాత, ఏపీవో, పెద్దారవీడు**

**ప్రముఖులకు వాటాలంటూ ప్రచారం**

ప్రతివారం ఉపాధి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసే మొత్తంలో ఉన్నతాధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, విలేకరులకు వాటాలివ్వాలంటూ ఉపాధి హామీ సిబ్బంది జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు వాటా ఇవ్వకపోతే వారు బిల్లులు మంజూరు చేయరని, ప్రజా ప్రతినిధులకు వాటా ముట్టజెప్పకపోతే అసలు పనులే జరగనివ్వరని, క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించుకున్నదే అక్రమాల్లో వాటాల కోసమని, పాత్రికేయుకులకు ముడుపులు ఇవ్వకపోతే అక్రమాలపై కథనాలు ప్రచురిస్తే ఉపాధి పనుల్లో డొల్లతనం బయట పడుతోందని మండలస్థాయి అధికారులు ప్రచారం చేస్తున్నారు.

## అవీ..ఇవీ..

### కౌలుగుర్తింపు కార్డుదారులకే రాయితీ



సీసీఆర్‌సీ కార్డులపై సూచనలిస్తున్న తహసీల్దార్, ఏవో

పంగులూరు, మే 15(ఆంధ్రజ్యోతి):పంటసాగు చేసే కౌలు రైతులు తగిన గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు పొందగలుగుతారని తహసీల్దార్ సింగారావు, ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ముప్పవరం, కొండమూరు గ్రామాలలో గురువారం సి.సి.ఆర్.సి. కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 31 లోగా కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, వీఆర్‌వోలు సుబ్బారావు, రవిబాబు, వీఆర్‌ఏలు దిల్లా, దినేష్‌కుమార్, ఆయా గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

**పంట సాగుదారు హక్కుపత్రంతో ప్రయోజనం**

తోటవారిపాలెం (చీరాల) : పంట సాగు చేస్తున్న రైతులు సాగుదారు హక్కుపత్రం పొందడం ద్వారా ప్రయోజనం ఉంటుం దని ఏవో సుమతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తోటవారి పాలెం సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీ సీఆర్‌పీ చట్టము -2019 ప్రకారం కార్డు కాలపరిమితి 11 మాసాలు మాత్రమే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీటీ సుశీలదేవి, సెక్రటరీ భారతి, నాదెండ్ల కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

**వేటపాలెంలో...**

మండల పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఖరీఫ్- 2025పై రైతులతో ప్రణాళిక నిర్వహించారు. ఈక్రమంలో పీఎండీఎస్ విధానంతో ఉపయోగాలను సూచించారు. భూమిలో చీడ పీడ లేకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వనాథ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పాలీసెట్‌లో హర్షిత్ ప్రతిభ



హర్షిత్

అద్దంకిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌లో అద్దంకిలోని సంజీవనగర్‌కు చెందిన విద్యార్థి బత్తుల హర్షిత్ 120 మార్కు లకు 111 మార్కులు సాధించాడు. రాష్ట్రస్థాయిలో 1304వ ర్యాంక్ సాధిం చాడు. ఏపీఆర్‌జేసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నందు 150 మార్కులకు 121 మార్కులు సాధించినట్లు విజేత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అంకమ్మరావు తెలిపారు. హర్షిత్ పదివ తరగతిలో 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

### నియోజకవర్గానికి రూ.7 కోట్ల నిధుల మంజూరు

- సీసీరోడ్లు, సైడు డ్రైన్లు ఏర్పాటుకు పనుల గుర్తింపు

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్ కింద అద్దంకి నియోజక వర్గానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. పంగులూరు మండలంలో 30, బల్లికురవ మండలంలో 26, అద్దంకి మండలంలో 26, కొరిశపాడు మండలంలో 26, సంతమాగులూరు మండలంలో 32 పనులకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయి. ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ లు, ఇతర పనులు చేపట్టనున్నారు.

**కమ్యూనిటీ హాల్స్‌కు రూ.70 లక్షలు మంజూరు**

అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంలో బీసీ కమ్యూనిటిహాల్‌కు రూ.30 లక్షలు, బల్లికురవ మండలం సూరేపల్లిలో కమ్యూనిటీహాల్‌కు రూ.20 లక్షలు, కొరిశపాడు మండలం రాచపూడిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ అంజయ్య

అద్దంకి, మే 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలైన ఘటన మండలంలోని గోపాలపురంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన గోసాల అంజయ్య గురువారం ఉదయం బహిర్భూమి కి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.

### ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోండి

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్(పిఎంజెఎవై)ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ప్రతినిధి శేషబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్, పేరాల ఏఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

# ఆపత్కాలంలో అందని సాయం

- ప్రమాద సమయంలో వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం దృష్టి
- అధికారులకు ఉత్తర్వులు జారీ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు (ఫైల్)

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రెప్పపాటు కాలంలో జీవితాలను రోడ్డుప్రమాదాలు చిన్నాభిన్నం చేస్తుంటాయి. కుటుంబానికి ఆసరగా ఉన్న వ్యక్తి మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. ప్రమాదానికి గురైతే చికిత్స కోసం నగదు వెచ్చించి ఆర్థికంగా ఆయా కుటుంబాలు చితికి పోతాయి. దీన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం నగదు రహిత చికిత్స పథకం -2025 ను తీసుకొంది. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో బాధితులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగిన క్రమంలో ప్రమాదానికి కారకులు కొందరు అందుబాటులో లేకుండా పరారవుతుంటారు. అలాంటి కేసులు పోలీసు స్టేషన్లలో కోకొల్లలన్నాయి. ప్రస్తుతం 216 జాతీయ రహదారి విస్తరించిన తర్వాత ఇలాంటి ప్రమాదాలు అనేకం ఉన్నాయి. అలాంటి సమయాల్లో బాధితులకు తక్షణం వైద్యసాయం అందక వేలసంఖ్యలో అయోమయం స్థితిలో ఉంటున్నారు. సాధారణంగా ప్రమాదానికి కారణమైన వాహనానికి సంబంధించి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌తో కొంత ప్రయోజనం ఉంటుంది. కానీ అసలు వాహనాలే గుర్తించకపోతే బాధితలు పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

**బాధితులను ఆదుకొనేలా..**

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఆపత్కాలంలో సాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు ప్రమాదం బారిన పడి సాయం పొందని వారికి ఈ పథకం ద్వారా మృతిచెందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు ప్రకటించింది. అందుకు సంబంధించి వివరాలు ప్రమాదం జరిగిన స్టేషన్ పరిధి నుంచి, అలాగే ఆయా ప్రాంత రోడ్డు రవాణా శాఖ అధికారి నుండి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది. తద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ జరుగుతుంది. 2022లోనే కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టినా, నాటి వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నీరు కార్చింది. వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ఒక్కరంటే ఒక్కరికి కూడా సాయం అందజేయలేదు. అసలు ఈ పథకం ఉందని సామాన్య ప్రజలకు కూడా అవగాహన లేకపోవడంతో ఎందరో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఊహించనిప్రమాదం జరిగితే, అవగాహన లేక సాయం కూడా పొందని దయనీయ స్థితిలో ఉన్నారు.

**సాయం అందించడంపై టీడీపీ ప్రభుత్వం కసరత్తు**

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకంపై దృష్టి సారించింది. ప్రమాద బారిన పడిన ఏ ఒక్కరు ఇబ్బందులకు గురి కాకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాల జారీ చేసింది. ఇప్పటికే అధికారులు దీనిపై కసరత్తు ప్రారంభించారు. అలాగే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులకు మార్గనిర్దేశాలు జారీ అయ్యాయి.

**ప్రభుత్వం నుంచి సర్క్యులర్ అందింది**

ఉన్నతాధికారుల నుండి హిట్ అండ్ రన్‌పై సర్క్యులర్ అందింది. అలాగే వీటిపై సమీక్షలు నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం పథకంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పథకంతో బాధితులకు భరోసా ఉంటుంది.

**రామకృష్ణారెడ్డి, రోడ్డు భద్రత అధికారి, చీరాల**

# చిన్నారుల్లో విద్యాజ్ఞానం పెంపొందించేందుకు కృషి

**ఎమ్మెల్యే కొండయ్య**



ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పిల్లలకు చక్కనైన విద్యాజ్ఞానం అవసరమని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లికి హైస్కూల్ విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులతో సత్తా చాటింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నేరుగా అనుమల్లిపేటలోని దివ్యశ్రీ ఇంటికి వెళ్లి ఆమెను ఘనంగా సత్కరించారు. అలాగే నగదు ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ వ్యవస్థకు ధీటుగా బోధన జరుగుతుందన్నారు. విద్యా ర్థులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణ పనులకు సహకరించండి

**రైతులను కోరిన తహసీల్దార్ సింగారావు**



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పంగులూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సాగుతున్న (బీవీఈసీ)గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను ఆటంక పరచడం తగదని, రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయిన రైతులకు జ్యాప్యం లేకుండా ప్రభుత్వం తగిన పరిహారం చెల్లిస్తున్నదని తహసీల్దార్ సింగారావు అన్నారు. బెంగుళూరు, విజయవాడ ఎలివేటెడ్ కారిడార్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులను ఆటంకపరచిన జేవీ.పాలెం రైతులతో తహసీల్దార్ సింగారావు, సంబంధిత మెఘా ఇంజనీరింగ్ సంస్థ అధికారులు గురువారం చర్చించి వారికున్న అనుమానాలను నివృతి చేశారు. సేకరించిన భూమి వివరాలు, అందుకు నిర్దేశించిన నష్టపరిహారం, చెల్లింపుల గురించి వివరించారు. భూమి కోల్పోయిన రైతుల బ్యాంకు ఖాతాలలో సంబంధిత నగదు మొత్తాన్ని జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెగా ఇంజ నీరింగ్ సంస్థ జీఎం సుబ్బా నాయుడు, హైవేస్ సీనియర్ మేనేజర్ జగదీష్, కృష్ణంరాజు, సురేష్‌కుమార్, నరేష్, అంకమ్మరావు, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులను రైతులకు సకాలంలో అందించాలి

**అద్దంకి ఏడీఏ శ్రీనివాసరావు**



ఈ పోస్ యంత్రాలు అందజేస్తు ఏడీఈ శ్రీనివాసరాలు

మార్టూరు, మే15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో: డీలర్లు అందించాలని మార్టూరు ఏడీఈ కె వి శ్రీనివాసరావు అన్నారు.గురువారం మార్టూరు లో పారదీప్ ఫాస్పేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో,జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మార్టూరు డివిజన్ పరిదిలోని డీలర్లుకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏడీఈ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న డిజిటల్ ఆధారిత చర్యలతో వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.రైతులకు మరింతగా లబ్ధి చేకూర్చే నూతన మార్గాలను నిరంతరం అన్వేషించడమే వ్యవసాయశాఖ ప్రధాన లక్ష్యమన్నారు.అనంతరం అద్దంకి ఏడీఈ ధనరాజ్ మాట్లాడుతూ రైతులకు అధికంగా లబ్ధి చేకూర్చేలా ఎరువుల పంపిణీలో వ్యవస్థాపిత మరియు డిజిటలైజేషన్ లక్ష్యంగా ఈ పాస్ యంత్రాల తయారీ చేయడం జరిగిం దన్నారు. తరువాత యంత్రాలను వినియోగించే విధానంపై డీలర్లుకు వ్యవసాయఅధికారులు అవగాహన కలిగించారు.అదేవిధంగా యంత్రాల ప్రత్యేకతలను,వాటి ప్రయోజనాలను పారదీప్ సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ పి ప్రభాకర్ డీలర్లుకు వివరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో మార్టూరు,అద్దంకి,కొరిశపాడు,,జె పంగులూరు,సంతమాగులూరు,బల్లికురవ మండలాలకు చెందిన వ్యవసాయఅధికారులు, పిపిఎల్ సంస్థ ప్రతినిధులు హరికృష్ణ,గోపి,వెంకట్రావు,పలువురు డీలర్లు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం



కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) :వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకం పైపులైన్ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించిది. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. అయితే ఈ రహదారి, తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకానికి చెందిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌పై వెళుతున్న నేపథ్యంలో సమీపంలోని ఎత్తిపోతల పథకానికి ఇబ్బంది తలెత్తింది. దీనిపై స్థానిక రైతులు టీడీపీ నేత గోరంట్ల రామకృష్ణ ద్వారా ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి సమస్యను తీసుకుపోయారు. రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు ఉండడంతో పైప్‌లైన్ దెబ్బతిని నీటి సరఫరాలేక ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారి అధికారులతోపాటు, ఐడీసీ అధికారు ల దృష్టికి సమస్యను తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన అధికారులు సమస్యాత్మక ప్రాంతంలో 40 మీటర్ల పొడవున పాతపైపులను తొలగించి కొత్తపైపులతోపాటు, శాశ్వత పరిష్కారంగా బాక్స్ కల్వర్టు నిర్మించేలా చర్యలు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో సంబంధింత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాలలకు ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు



చందలూరులో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన ఫ్యాన్లు

పంగులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని 10 పాఠశాలలు, ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, పవర్ సేవింగ్ ఫ్యాన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. విద్యుత్ ఆదా చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ధృవీకరించిన లైట్లు, ఫ్యాన్‌లను పాఠశాలలో అమర్చుతున్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌లో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సమకూర్చిన 193 ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, 198 పవర్ సేవింగ్ ఫ్యాన్‌లు ఆయా పాఠశాలల అవసరాలకు తగిన విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని చందలూరు, కొండమంజులూరు, ముప్పవరం, పంగులూరు ఉన్నత పాఠవాలలు, అలవలపాడు (ఉర్దూ), తూర్పు కొప్పెరపాడు, నూజెళ్ళపళ్ళి, కోటపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత, కొండమంజులూరు, నూజెళ్ళపల్లిలోని ప్రాథమిక పాఠశాలతో పాటు ముప్పవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

## మందుబాబుల పరస్పర దాడులు

- చీరాల ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : మందుబాబులు పాతకక్షల నేపథ్యంలో పరస్పరం మద్యంసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటన గురువారం వేటపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని మద్యందుకాణం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తుఫాన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ షేక్ కాలేషాకు, అదే ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీ ముఠామేస్త్రీ పల్లపు అంకమ్మరాజుకు ఇటీవల స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో మద్యం దుకాణంలో వేర్వేరుగా మద్యం సేవిస్తూ, ఘర్షణ పడ్డారు. దీంతో కాలేషా తలకు తీవ్ర రక్తగాయాలు కాగా, అంకమ్మరాజు స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

## డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచితంగా మూడు మాసాలు ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే శిక్షణకు సంబంధించిన వివరాలను 18 -30 సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని, వివరాలకు 79814 43777 నంబరును సంప్రదించాలని తెలిపారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

- సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : డీపీటీవో రవికాంత్



గ్యారేజ్ లో సిబ్బందితో మాట్లాడుతున్న రవికాంత్

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిచాలని గుంటూరు, బాపట్ల డీపీటీవో రవికాంత్ అన్నారు. అద్దంకి, మేదరమెట్ల బస్టాండ్లను, ఆర్టీసీ గ్యారేజ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. గతంలో అద్దంకి డిపో అధిక కేఎంపీఎల్ తీసుకవస్తూ, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం వెనుక బడి ఉందని, సిబ్బంది అందరు అంకిత భావంతో పనిచేసి మరోసారి ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. అద్దంకి డిపోకు 13 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో ఆయా మార్గాలలో పాత బస్సుల స్థానంలో కొత్త వాటిని నడుపుతారన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, కొండలు తదితరులు ఉన్నారు.



# రెక్కల కష్టం బుగ్గిపాలు

- అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం
- రూ.2 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో దగ్ధమైన నగదు

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఊరికి దూరంగా ఉండే చెంచుకుటుంబం వారిది. నిత్యం కూలిపనులకు చేసుకుంటేనే వారి జీవనం సాగేంది. దీనికోసమే చంటి బిడ్డలను సైతం ఇంటిలో ఉంచి కూలికి వెళ్లారు. అయితే అనుకోని అగ్ని ప్రమాదం వారి రెక్కల కష్టాన్ని బుగ్గిపాలు చేసింది. వారు కష్టించి దాచుకున్న రూ.1.50 లక్షల నగదు, అరసవర బంగారం అగ్నికి ఆహుతైంది. మంటలు అంటుకున్న సమయంలో ఇంటిలోని చిన్నారులను స్థానికు లు గమనించి బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.


అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం మండల కేంద్రమైన పర్చూరులోని చెంచు ల కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన నల్లబోతుల రాజా కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. దీనిలో భాగంగా గురు వారం భార్య భర్తలు ఇరువురు కూలిపనులకు పోయారు. చంటిబిడ్డలైన ఇద్దరు చిన్నారులను ఇంటిలోనే ఉంచారు. ఈ క్రమంలో మధ్యాహ్న అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ఇంటిలోని చిన్నారులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి వారిని బయ టకు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఇల్లు కాలిపోయింది. ఇంటితో పాటు ఇంటిలో కాయకష్టం చేసి సంపాదించి కూడ బెట్టుకున్న రూ.1.50 లక్షల నగదుతో పాటు, అరసవర బంగారు ఆభరణాలు కాలిబూడిద య్యాయి. చెంచుల కాలనీకి చెందిన ఇంటిలో మంటలు చెలరేగటంతో చుట్టుపక్కల వారు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విద్యు త్ షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా, మరే ఇతర కారణాల అనేది తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్సై మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

**నిరాశ్రయులైన కుటుంబం**

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం వారిది చంటి బిడ్డల ను ఇంటివద్దే వదిలివేసి కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని నింపింది. ప్రమా దంలో ఇంటిలో ఉన్న సామాన్లతో పాటు, కూలీనాలీ చేసుకొని సంపాదించుకున్న నగదు కాస్తా కాలిబూడిద కావటంతో వారు బోరున విలపిస్తున్నారు.



ఉష్ణోగ్రత వివరాలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నెల్లూరు | 40.0 | 30.0 |
| కావలి | 38 | 29 |
| ఆత్మకూరు | 40 | 30 |
| ఉదయగిరి | 39 | 28 |
| కందుకూరు | 39 | 28 |



# 'క్వార్ట్జ్' కేసులో పోలీసుల దూకుడు

- మరో 11 మందికి నోటీసులు
- సుప్రీంకోర్టులో కాకాణి స్పెషల్ లీవ్ పిటిషన్
- బెంగళూరు, హైదరాబాదుకు ప్రత్యేక బృందాలు
- శ్రీలంకకు వెళ్లనున్న మరో బృందం

నెల్లూరు (క్రైం), మే 15 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఈ కేసులో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏ4గా చేర్చిన పోలీసులు నెలల తరబడి గాలిస్తున్నా ఆయన జాడ మాత్రం దొరకడం లేదు. ఈ క్రమంలోనే ఈ కేసులో మరో 11 మందికి ఈ నెల 12 నుంచి పోలీసులు నోటీసులు అందించారు. వారిని 13 నుంచి 18వ తేదీలోపు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే పలువురు విచారణకు హాజకు కాకపోవడం, పలుమార్లు నోటీసులు ఇస్తున్నా పట్టించుకోకపోవడంతో వారిపై చట్టపరంగా ముందుకు వెళ్లేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు.

**● 11 మందికి నోటీసులు**

రుస్తుం క్వార్ట్జ్ కేసులో పోలీసులు మరో 11 మందికి నోటీసులు అందించారు. వాకాటి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు సుప్రజ, ప్రభాకర్‌రెడ్డి, ఎం గోపాలకృష్ణారెడ్డి, బత్తుల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం వెంకటశేషయ్య, బిరదవోలు మహేంద్ర, పెంచల రెడ్డి, శేఖర్, సుమంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందించడానికి పోలీసులు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వచ్చారు. నోటీసులు అందుకున్న వారు కూడా విచారణకు హాజరు కాకపోవడంతో వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కాకాణి ప్రధాన అనుచరుడు మందల వెంకటశేషయ్య శుక్రవారం పోలీసుల విచారణకు హాజరు కావాల్సి ఉంది.

**● రాష్ట్రాలు, దేశాలు దాటి గాలింపు**

క్వార్ట్జ్ కేసులో ముద్దాయిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం జిల్లా పోలీసులు పలు రాష్ట్రాలలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు బృందాలు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయినా కాకాణి జాడ తెలిలేదు. ఈ క్రమంలో శ్రీలంకలో కాకాణి ఉన్నాడన్న సమాచారం రావడంతో అక్కడకు ఓ ప్రత్యేక బృందం వెళ్లనున్నట్లు తెలిసింది. మరోవైపు కాకాణి బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో ఆయన సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను బెయిల్ కోసం వేశారు. ఇక ఈ కేసులో ఎ-7, ఎ-8గా ఉన్న వారు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు. ఎ-6 బెయిల్ పిటిషన్‌పై ఎస్సీఎస్టీ కోర్టు వచ్చేవారం విచారణ అంటూ తీర్పు ఇచ్చింది.



మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే కోటంరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద
## వంతెనలు నిర్మిస్తాం


- త్వరలో నిధులు విడుదల చేస్తాం
- డిసెంబరు కల్లా యూడీఎస్, తాగునీటి పనుల పూర్తి
- రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడి
- 26 డివిజన్లలో 339 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

8

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి : కలెక్టర్

నెల్లూరు (విద్య) : ఈ నెల 19 నుంచి జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ అన్ని కేంద్రాల్లో నిరంతర విద్యుత్, ప్రథమ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రంలో మంచినీరు వసతి, పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని తెలిపారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లావ్యాప్తంగా 38 కేంద్రాల్లో 5,422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే 19 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూ డా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ వరప్రసాద్ రావు పాల్గొన్నారు.

# భోక్తలకే 'సహకారం'!



డీసీసీబీలో మొండిబకాయిలు రూ.150 కోట్లు

నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 24 బ్రాంచీలు ఉన్నాయి. ఈ బ్రాంచ్ పరిధిలో ఏటా రూ.1800 కోట్ల వరకు రైతులకు రుణాల రూపంలో ఇస్తున్నారు. ఇంత సామర్థ్యం కలిగిన ఈ బ్యాంకును కొందరు అవినీతిపరులు కొల్లగొట్టేస్తున్నారు. ఆర్థిక సామర్థ్యాన్ని కుళ్లబొడిచేస్తున్నారు.

**● వ్యవసాయ మొండి బకాయిలు**

నాయుడుపేట నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు సొసైటీలో రూ. 30 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. ఉదయగిరి పరిధిలోని కమ్మపాలెం సొసైటీ రూ.11 కోట్లు, వింజమూరు పరిధిలోని కుడుములదిన్నె సొసైటీ రూ.7కోట్లు, వెంకటగిరి సొసైటీ రూ.11 కోట్లు, ఉదయగిరి మండలం కమ్మవారిపాలెం సొసైటీ రూ.8 కోట్లు. ఇలా డీసీసీబీ పరిధిలోని పలు సొసైటీలన్నింటిలో కలిసి సుమారు 80 కోట్ల వరకు మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. వీటిలో సుమారు రూ.40 కోట్ల వరకు ఇక రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు. మిగిలిన 40 కోట్లు కూడా వస్తాయన్న గ్యారెంటీ లేదు. నిజమైన రైతులకు ఇచ్చిన రుణాల విషయంలో ఢోకా లేదు. అవి వసూళ్ళు అయిపోతున్నాయి. బినామీ పేర్లతో నాయకులు, సిబ్బంది భోంచేసిన అప్పులు మాత్రం తిరిగి రావడం లేదు. వీటిని వసూలు చేయాలనే తాపత్రయం డీసీసీబీ యంత్రాంగంలో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**● మైక్రో ఫైనాన్స్ రుణాల పేరుతో..**

డ్వాక్రా మహిళలకు భారీగా రుణాలు ఇప్పించి మంచి మార్కులు కొట్టేయాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం డీసీసీబీలపై తీసుకొచ్చిన ఒత్తిడి ఆ శాఖలో పనిచేసే క్షేత్ర స్థాయి ఉద్యోగులకు వరంగా మారింది. దీంతో డ్వాక్రా మహిళల పేరు చెప్పి ఏకంగా రూ.65 కోట్లు పక్కదారి పట్టించారు. ఈ పాపంలో ఆ శాఖలోని అన్నిస్థాయిల అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా డీసీసీబీలో భూమి కలిగిన రైతులకే రుణాలు ఇస్తారు. ఒకవేళ వారు తీసుకున్న రుణం చెల్లించని పక్షంలో భూమిని వేలం వేయడం ద్వారా రికవరీకి ఆస్కారం ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా డ్వాక్రా మహిళలకు వ్యవసాయ అనుబంధ వ్యాపారాల కోసం మైక్రో ఫైనాన్స్ ఇవ్వమని డీసీసీబీలపై ఒత్తిడి తెచ్చి టార్గెట్లు విధించింది. దీంతో సొసైటీల పరిధిలోని కార్యదర్శులు ఏడాపెడా రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలు తిరిగి చెల్లించే పనిలేదని డ్వాక్రా మహిళలకు నచ్చజెప్పి వారి చేత సంతకాలు చేయించుకొని రుణ మొత్తాలను వీరు భోంచేశారు. ఇంకొంత డ్వాక్రా మహిళలకు తెలియకనే వారి పేర్ల మీద రుణ మొత్తం తీసి జేబులో వేసుకున్నారు. కొంతమంది నిజమైన లబ్ధిదారులకు రుణాలు అందినా ఎవరూ తిరిగి చెల్లించడం లేదు కాబట్టి మనమెందుకు చెల్లించాలి అని మిన్నకుండిపోయారు. దీంతో ఈ పథకం కింద ఇచ్చిన రూ.65 కోట్లు మొండి బకాయిలుగా మిగిలిపోయి నిరర్థక రుణాల పద్దులో కలిసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

**● డీసీసీబీపై తీవ్ర ప్రభావం**

రుణాల రికవరీ శాతాన్ని బట్టే నాబార్డు డీసీసీబీలకు నిధులు విడుదల చేస్తుంది. మొండి బకాయిల మొత్తం పెరిగితే నాబార్డు నుంచే అందే నిధులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు కేవలం 40 కోట్లను మాత్రమే నిరర్థక ఆస్తులుగా లెక్కల్లో చూపించారు. మిగిలిన 110 కోట్లను రావాల్సిన బకాయిల పద్దులో చూపించారు. రెండు, మూడేళ్లు గడిస్తే ఇవి కూడా నిరర్థక ఆస్తుల పద్దులోకి వెళ్లిపోతాయి. అది జరిగితే డీసీసీబీకి నాబార్డు నుంచి వచ్చే నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది.

నాటి వైసీపీ పెద్దల అత్యుత్సాహం.. క్షేత్రస్థాయి అధికారుల అవినీతి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌కు (డీసీసీబీ) మచ్చ తెచ్చిపెట్టింది. మొండి బకాయిల రూపంలో రూ.150 కోట్ల మేరా నష్టపోయే పరిస్థితి దాపురించింది. మైక్రో ఫైనాన్స్ పేరుతో డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు ఇప్పించి మంచిపేరు తెచ్చుకోవాలని గత వైసీపీ ప్రభుత్వం చూపిన అత్యుత్సాహం అవినీతిపరులైన ఉద్యోగులకు వరంగా మారింది. దీనికితోడు వ్యవసాయ రుణాల వసూళ్లలోనూ సుమారు రూ.80 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. ఇప్పటికే ఇలాంటి మొండి బకాయిల్లో రూ.40 కోట్లు తిరిగి రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా గుర్తించింది. మరో రూ.110 కోట్లు వస్తాయో, రావో చెప్పలేని స్థితిలో ఉన్నాయి. ఉన్నతాధికారులు, పాలక వర్గ సభ్యులు గట్టిగా పట్టించుకోకుంటే మరో రెండు, మూడేళ్లలో ఈ 110 కోట్లు కూడా నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరిపోతాయి. ఇదే జరిగితే రూ.150 కోట్లు అప్పనంగా అవినీతిపరులైన కొందరు ఉద్యోగులకు, రాజకీయ పెద్ద మనుషులకు వదిలేసినట్లు అవుతుంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- నిరర్థక ఆస్తులుగా రూ.40 కోట్లు
- మిగిలిన రూ.110 కోట్లు వస్తాయో రావో అనుమానమే!
- డ్వాక్రా సంఘాల పేరుతో రూ.60 కోట్ల మొండి బకాయిలు
- నాటి వైసీపీ పెద్దల ఒత్తిళ్లతో ఎడాపెడా రుణాలు
- అవకాశంగా మలుచుకున్న సొసైటీ ఉద్యో
- బినామీ పేర్లతో రుణాలు స్వాహా

ఉద్యోగుల బదిలీలకు
# గ్రీన్‌సిగ్నల్!

### జూన్ 2 వరకు నిషేధం ఎత్తివేత
### ఐదేళ్లు నిండిన వారికి స్థానచలనం తప్పనిసరి

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. సాధారణ బదిలీలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించింది. శుక్రవారం నుంచి జూన్ 2వ తేదీ వరకూ బదిలీలపై బ్యాన్ తొలగుతుంది. ఈ మధ్య కాలంలో బదిలీల ప్రక్రియ పూర్తి చేసేలా ఆయా శాఖలకు అధికారాలు ఇచ్చింది. అన్ని శాఖలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. గడిచిన ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అలానే ఐదేళ్లు నిండని వారికి కూడా వ్యక్తిగత రిక్వెస్ట్ మీద ఖాళీలను బట్టి బదిలీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికీ స్థానచలనం తప్పదు. జిల్లాలో సుమారు 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 3 వేల మంది వరకూ తప్పనిసరి బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలానే పర్సనల్ రిక్వెస్ట్ మీద మరో రెండు వేల మంది వరకూ బదిలీ జరగవచ్చని అంచనా. కొన్ని శాఖల్లో ఏళ్ల తరబడి కొందరు ఉద్యోగులు తిష్ట వేసి ఉన్నారు. అటువంటి వారందరికీ ఈ దఫా స్థాన చలనం తప్పదు. ఇక వచ్చే ఏడాది మే 31లోపు పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులకు బదిలీ నుంచి మినహాయించారు. ఒకవేళ అటువంటి ఉద్యోగులు రిక్వెస్ట్ పెట్టుకుంటే బదిలీ చేయవచ్చు. ఈ దఫా బదిలీల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అలానే గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన వారు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. శుక్రవారం నుంచి ఉద్యోగులు బదిలీల కోసం ఆయా హెచ్‌వోడీల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని దరఖాస్తులు అందాక ఆయా శాఖల అధిపతులు పరిశీలించి అర్హులైన వారికి స్థానచలనం కల్పిస్తారు.

## ఏపీ ఈసెట్‌లో 94.35 శాతం మంది ఉత్తీర్ణత

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమో, బీఎస్సీ(మ్యాథ్స్) విద్యార్థులకు బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే ఏపీ ఈసెట్ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. జిల్లాలో 574 మంది బాలురు, 211 మంది బాలికలు కలిపి 785 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం జేఎన్‌టీయూ మే 6వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు 761 మంది హాజరవగా 718 మంది (94.35 శాతం) అర్హత సాధించారు. చేజర్ల మండలం మడపల్లికి చెందిన పైడాల నాగ పూజిత బీఎస్సీ మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయిలో పదవ ర్యాంకు సొంతం చేసుకుంది.

# సు'రక్షిత'కు నీళ్లొదిలారు!

- తుప్పు పడుతున్న బృహత్తర పథకం
- 5 మండలాలకు ఫ్లోరైడ్ నీరే దిక్కు!
- నిధులు విడుదల చేయని గత వైసీపీ సర్కారు
- నిర్వహణలో చేతులెత్తేసిన అధికార యంత్రాంగం
- ఫలితంగా అవస్థలు పడుతున్న పల్లెజనం



కనియంపాడు ఎస్సీ కాలనీకి చెందిన కొండిపోగు మల్లికార్జున ఫ్లోరైడ్ నీరు తాగడంతో కాళ్లు సన్నబడి చచ్చుబడి పోయాయి. దీంతో ఎలాంటి పనులు చేయలేని స్థితిలో పట్టుమని పది నిమిషాలు కూడా నిలబడే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఒంటరి జీవనం సాగిస్తున్న ఆయనకు పింఛనే దిక్కుగా మారింది. వైద్యులను సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది.

ఈయన పేరు చిల్లకొలుసు చిన మాల కొండయ్య. తూర్పు బోయ మదగల. నిరుపేద కుటుంబానికి ఆయన ఫ్లోరైడ్ నీటితో దాహం తీర్చుకుంటున్న తరుణం లో ఆరేళ్లుగా రెండు కాళ్లు వంకర్లు తిరిగి శరీరమంతా చచ్చుబడి పోయింది. మంచానికే పరిమితమయ్యాడు. అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారులు సైతం మృత్యువాత పడడంతో ఎలాంటి ఆదరువు లేకుండా పోయింది. ప్రస్తుతం భార్యతో కలిసి ప్రభుత్వం అందించే పింఛనుపైనే ఆధారపడి జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది.







కంప చెట్లతో నిండిన నీటి శుద్ధి తొట్టెలు

నిరుపయోగంగా మారిన మైక్రో ఫిల్టర్లు



అలంకార ప్రాయంగా మిగిలిన ట్యాంకు

ఉదయగిరి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలనే సదుద్దేశంతో గండిపాళెం జలాశయ ప్రాంగణంలో 1997లో రూ.7.55 కోట్లతో నిర్మించిన రాజీవ్ సబ్ మిషన్ పథకం పాలకుల పుణ్యమా అని మూలకు చేరింది. ఉదయగిరి, వరికుంటపాడు, మర్రిపాడు, కొండాపురం, దుత్తలూరు మండలాల్లోని 66 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత మంచినీరు అందించేలా ఆ పథకాన్ని రూపకల్పన చేశారు. నీటి శుద్ధిప్లాంటును నిర్మించి ప్రత్యేక పైపులైన్ల ద్వారా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు శుద్ధిజలాన్ని సరఫరా చేసే పనులను 2002లో పూర్తి చేశారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రారంభించారు. కొన్నేళ్లపాటు సజావుగా సాగినా కాలక్రమేణా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పుణ్యమా అని నీటిని సరఫరా చేసే గ్రామాల సంఖ్య తగ్గుముఖం పడుతూ ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడి జేబులు నింపుకున్నారే తప్ప నిర్వహణను గాలికొదిలేశారని విమర్శలు ఉన్నాయి.

**● నిధుల శాపం**

అంతంతమాత్రంగా మంచినీటిని సరఫరా చేస్తున్న క్రమంలో గత వైసీపీ హయాంలో నిధులు మంజూ రు కాకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకపోవడంతో అటువైపు కన్నెత్తి చూసే నాధులే కరువయ్యారు. దీంతో అధికారులు సైతం మనకెందుకులే అంటూ మౌనం దాల్చడంతో పథకం మూలకు చేరింది. రూ.లక్షలు విలువ చేసే మైక్రో, నీటిశుద్ధి ఫిల్టర్లు, విద్యుత్ మోటార్లు, ఇతరత్రా సామగ్రి తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. కనీసం పంప్‌హౌస్ గదికి కూడా తాళాలు వేయకపోవడంతో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. నీటిశుద్ధి తొట్టెల చుట్టూ కంపచెట్లు పెరిగి గోడలు సైతం నెర్రలు బారి ధ్వంసమవుతున్నాయి. ప్రాంగణమంతా అడవిని తలపిస్తుండగా, కొంతమంది తమ అవసరాల కోసం అక్కడున్న ఇసుక, ఇతర సామగ్రిని తరలించుకు పోతున్నారు.

**● రోగాల బారిన ప్రజలు**

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కూతవేటు దూరంలో తాగునీటి పథకం ఉన్నా ప్రజలకు సురక్షిత నీటితో దాహం తీర్చుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో చేసేదేమీలేక గ్రామాల్లోని ఫ్లోరైడ్ నీటితో గొంతు తడుపుకొని రోగాల పాలు కావాల్సి వస్తోందని ప్రజలు వాపోతు న్నారు. దిష్టిబొమ్మల్లా ఓవర్‌హెడ్ ట్యాంకులు వెక్కిరిస్తున్నా యనే తప్ప తాగునీటిని అందిం చలేక పోతున్నాయని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. దీంతో కిలో మీటర్ల కొద్దీ పరుగులు తీసి మంచినీటిని కొనుగోలు చేయ డం తలకు మించిన భారంగా మారుతుందని బెంబేలెత్తిపోతున్నారు. మెట్ట ప్రాంతాలకు వరంగా మారిన ఈ పథకాన్ని పునరుద్ధరిం చేలా పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి



కనియంపాడు, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఫ్లోరిన్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రక్షిత నీటి సరఫరా ఆగిపోవడంతో ఫ్లోరిన్ నీటితోనే సర్దుకుంటున్నారు. ఈ విషయమై కీలక సమావేశాల్లో ప్రస్తావించినా, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి.

- కే. దిలీప్‌కుమార్, సర్పంచు వరికుంటపాడు

### కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నాం



రక్షిత నీరు అందించేందుకు గ్రామాల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఫ్లోరైడ్ నీటిని తాగి కిడ్నీ సంబంధిత వ్యాధులతో కొంతమంది మృత్యువాత పడుతున్నారు. మరికొంతమంది మంచాలకే పరిమితమవుతున్నారు. గండిపాళెం నుంచి రాజీవ్ టెక్నాలజీ మిషన్ పథకం ద్వారా రక్షిత నీరు అందించాలి.

- దొడ్లా మౌలాలి, తోటలచెరువుపల్లి

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 125 |
| స్కిన్ చికెన్ | 224 |
| స్కిన్‌లెస్ | 250 |

కోడిగుడ్ల ధర (100): 515

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చేయాలి

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. సిబ్బంది అం దరూ సకాలంలో విధులకు హాజరైనట్లు తెలిపారు ప్రతి ఉద్యోగి ఫీల్డ్‌లోకి వెళ్లేట ప్పుడు మూమెంట్ రిజిస్టరులో ఎక్కడికి వెళ్తున్నది కారణం నమోదు చేసి వెళ్లాలని తెలిపారు.


హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

## జనరల్ సర్జన్ పోస్టు భర్తీతో మెరుగైన సేవలు

● డాక్టర్ హరీష్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్



ఉలవపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 30 పడకల సీహెచ్‌సీలో జనరల్ సర్జన్ పోస్టు భర్తీ చేస్తే మెరుగైన వైద్యసేవలు అందిచవచ్చని సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లతోపాటు ముగ్గురు జూనియర్ డాక్టర్లు ఉన్నారు. ఎక్స్‌రే, ల్యాబ్, ఆధునిక పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ వంటివి ఉన్నాయి. నిత్యం సుమారు 150 మంది రోగులను చూస్తుంటామని ఆయన తెలిపారు.

? : సీహెచ్‌సీలో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తారు.

! : చిన్నపిల్లలతోపాటు సాధారణ రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నాం. ఎమర్జెన్సీ డెలివరీ, రోడ్డు ప్రమాదాల కేసులు కూడా చూస్తుంటాం.

? : గైనకాలజిస్టు లేరు కదా.. అత్యవసర కాన్పుల పరిస్థితి ఏమిటి.

! : గత నెలలో కందుకూరు నుంచి డాక్టర్ సుగుణకుమారిని నియమించారు. ఆమె సెలవుపై వెళ్లినందున సాధ్యమైనంత వరకు డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సాధారణ కాన్పుకు ప్రయత్నిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కందుకూరు, ఒంగోలుకు తరలిస్తున్నాం.

? : అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయా ?

! : గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తులకు ఈసీజీ, రక్త పరీక్షలు చేస్తాం. టెనెక్టిప్లెజ్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. అలాగే తేలు, పాము, కుక్క కాట్లకు కూడా మందులు అందుబాటులో ఉన్నాయి.

## రూ. కోట్ల ఆస్తులున్నా... ఆదాయం సున్నా !

● విశేష పూజలు చేయలేమని పూజారుల మెలిక ● ఆలయ వ్యవహారాలు తమకే అప్పగించాలని డిమాండ్
● వారి తీరుపై సర్వత్రా విమర్శలు ● అంకమ్మ ఆలయంలో విచిత్ర పరిస్థితి


పునర్నిర్మాణం జరిగిన గ్రామదేవత అంకమ్మ ఆలయం


అంకమ్మ ఆలయ స్థలం ఆక్రమించి నిర్మించిన దుకాణాలు

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ పునఃనిర్మాణం వైభవంగా జరుగుతున్నా నిర్వహణ పట్ల భక్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.కోట్లు వెచ్చించి ఆలయ పునర్నిర్మాణం, అనివేటి మండపం నిర్మిస్తున్నా.. అమ్మవారికి రూ.కోట్ల విలువజేసే ఆస్తులున్నా నిర్వహణకు పైసా ఆదాయం లేని దుస్థితి. ఆలయంలో మా ఆధిపత్యం కొనసాగాలి... మా కనుసన్నల్లోనే భక్తులు పూజలు చేసుకువెళ్లాలి.. అన్నరీతిలో అర్చకులు వ్యవహరిస్తున్నారు. వారి తీరుపట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నడిబొడ్డున అమ్మవారికి సుమారు1.5 ఎకరాలు ఉండగా, అందులో ఆలయ నిర్మాణం పోను ప్రధాన రహదారికి అభిముఖంగా 25 వాణిజ్య దుకాణాలు నడుస్తున్నాయి. వాటి నుంచి రూపాయి కూడా ఆదాయం రావటంలేదు. గతంలో వేలం ద్వారా కొంతకాలం సక్రమంగానే ఆదాయం వచ్చినా, ఆతర్వాత వారు అద్దెలు చెల్లించలేదు. ఆలయ పునర్నిర్మాణం కోసం ఆ దుకాణాలను పూర్తిగా తొలగించడంతో ప్రస్తుతం అమ్మవారికి ఆదాయం రావడం లేదు. ఆలయ స్వీపర్లకు కూడా సక్రమంగా జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది.

● వేలంలో అందరికీ అవకాశం ఇవ్వాలి

తాజాగా శాశ్వత ప్రాతిపదికన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సంకల్పించి ఈనెల 24న వేలంపాటకు ఏర్పాట్లు చేశారు. అయితే కనీసం మూడేళ్ల జీఎస్టీ ఉండాలన్న నిబంధనతోపాటు 11 ఏళ్లపాటు లీజుకు పాడుకున్నవారే షాపులు నిర్మించుకోవాలన్న షరతులతో వేలం పెడుతుండటంతో అందరూ వేలంలో పాల్గొనలేని పరిస్థితి వచ్చింది. సరైన రీతిలో రూముల నిర్మాణం జరిగితే ఏటా కనీసం రూ. 40 లక్షలు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

● పూజారుల తీరుపై అసంతృప్తి

ప్రత్యేక పూజలు, కైంకర్యాలు మా అభీష్టం మేరకే జరిగేలా చూడాలని, ఆలయం వద్ద ఎలాంటి రూముల నిర్మాణం వద్దని ఆలయ పూజారులు, కొందరు ఆచారస్తులను కలుపుకుని దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖరాయటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం పల్లకీసేవ, అభిషేకం నిర్వహించే విషయంలో పూజారులు అడ్డంకులు సృష్టిస్తూ ఉన్నారు. భక్తులు ఒకటిచెబితే వారు మరోలా చేయటం పరిపాటిగా మారింది. ఈ స్థితిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూజారుల తీరుమారేలా కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎప్పటిలాగే వారు పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆదమరిస్తే.. ఆసుపత్రికే...!


పాతూరు రాజీవ్‌నగర్ వద్ద దెబ్బతిన్న సీసీ రోడ్డు

కావలిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పాతూరు రాజీవ్‌నగర్ పంట కాలువ పక్కనున్న సీసీ రోడ్డు బద్దలుగా పగిలి గుంతగా ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. పంట కాలువ రిటర్నింగ్ వాల్ లేనందున కాలువ అంచున సీసీ రోడ్డు కుంగిపోయి పగిలిపోయిఉండడంతో ప్రమాదం పొంచివుంది. రెండేళ్లనుంచి రోడ్డు ఇదే దుస్థితి ఉన్నా, ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వీధి లైట్లు కూడా సరిగ్గా లేకపోవడంతో అంధకారం అలుముకుంటుంది. ప్రమాదం జరిగినప్పుడు పక్కనేఉన్న పంట కాలువలో ద్విచక్రవాహన దారులు పడి గాయాలయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## కొలతల ప్రకారమే 'ఉపాధి'వేతనాలు



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) ఉపాధి కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు లభించనున్నట్లు ఏపీవో దయాసాగర్ తెలిపారు. మండలంలోని శాఖవరం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి, 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలన్నారు. ప్రథమచికిత్స పెట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్‌లు, తాగునీరు తదితర వసతులు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.మస్టర్లను కచ్చితంగా వేయాలని సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నవ్వులూరి రామకృష్ణ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె జయప్రదం కోసం కార్మిక సదస్సు

కావలిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి) ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు గురువారం స్థానిక షాదీమంజిల్‌లో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీఐటీయూ నేత వసుంధరాదేవి, ఏఐటీయూసీ నాయకులు మల్లి అంకయ్య, ఏఐఎఫ్‌టీయూ న్యూ తరఫున శ్యామల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక హక్కులను కాలరాసే విధానాలు అవలంబి స్తున్నారన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి హక్కులు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సదస్సులో సీఐటీయూ నేత పెంచులయ్య, సీపీఐ నాయకులు నాగరాజు, శ్యామల, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 234 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 320పొగాకు బే ళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 11 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 234బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-77, ఆర్‌ఆర్-1, సీఆర్-4, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 86బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.246.05గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ. ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

## అత్యాధునిక వసతులతో వీఆర్ హైస్కూల్

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలను నిరుపేద విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులతో సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లకు ఐదువేల మంది పిల్లలకు అడ్మిషన్స్ కల్పిస్తామన్నారు.

## వచ్చామా.. వెళ్లామా.. అనేది కాదు
## రోడ్లపై చెత్త కనిపించకూడదు


మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మే15(ఆంధ్రజ్యోతి) శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు సమయానికి డ్యూటీకి వచ్చామా ... వెళ్లమా... అనేది కాదు ...రోడ్లపై చెత్త కనిపించకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ అన్నారు. కమిషనర్ చాంబరులో గురువారం సాయంత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో ఆయన పారిశుధ్యం మెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. ట్రంకు రోడ్డులో నిత్యం చిమ్ముతూ చెత్త ఎత్తుతున్నా మళ్లీ రోడ్డుపై చెత్త కనిపిస్తూనే ఉంటుందని, మీరు అసలు ఏమి చేస్తున్నారని కమిషనర్ ప్రశ్నించారు. రోడ్లపై తిరుగుతూ చెత్తను ఎత్తిన తర్వాత రోడ్లపై ఎవరు వేస్తున్నారో గుర్తించి వారు చెత్త వేయకుండా చైతన్యం తీసుకురావాలన్నారు. పలు పర్యాయాలు చెప్పినా వారు చెత్త వేస్తుంటే అలాంటి వారిపై జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రంకు రోడ్డుపై చెత్త కనిపించకుండా చేసేందుకు ట్రంకురోడ్డును 7 విభాగాలుగా విభజించి 7 టీమ్‌లను వేశారు. ట్రంకు రోడ్డు తోపాటు దానికి అనుబంధంగా ఉన్న రోడ్లలో కూడా పారిశుద్య బాధ్యతలను ఆ టీమ్‌లకు అప్పగించారు. అలాగే రోడ్ల మీద నిషేధిత ప్లాస్టిక్ కూడా కనిపించ కుండా చూడాలన్నారు. రోడ్లపై చెత్త కనిపిస్తే ఇక మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

## కావలి మండల సమావేశం మళ్లీ వాయిదా


సమావేశానికి హాజరైన ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీడీవో

కావలి రూరల్, మే15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన గురువారం జరగాల్సిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మినహా ఎంపీటీసీ లు హాజరు కాలేదు. దీంతో కోరం లేక మండల సమావేశం మళ్లీ వాయిదా పడింది. మండలంలోని 17 పంచాయతీలకు గాను 16 మంది ఎంపీటీసీలు ఉండగా, మండల గ్రాంటులో కొంతైనా తమకు కేటాయించకుండా అధికార పార్టీ నాయకుల చేత ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పనులు చేయిస్తున్నందున ఈనెల 6న, 15న జరిగిన మండల సమావేశానికి రాకుండా బాయ్‌కాట్ చేసినట్లు ఎంపీటీసీలు పేర్కొన్నారు.

● అధికారపార్టీ నేతలతో పనులు

మండల గ్రాంటులో కొంత మీకు కేటాయిస్తామని చెబుతూ సమావేశానికి వచ్చినప్పుడు మాచేత సంతకాలు చేయిస్తూ, పనులు మాత్రం అధికార పార్టీ వారికి అప్పగిస్తున్నారని ఎంపీటీసీ గంగన్నగారి యాదగిరి తెలిపారు. అందువల్ల సమావేశాన్ని బాయ్‌కాట్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఎంపీటీసీలంతా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు.

## టీడీపీ నేత ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలు


కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఇంటూరి రాజేష్

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలను గురువారం ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ కార్యకర్తలు, వివిధ గ్రామాల్లోని రాజేష్ అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొని రాజేష్‌తో కేకు కట్‌చేయించారు. ఈ సందర్భంగా ఆయన అనుచరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోనూ రాజేష్ అనుచరులు కేకులు కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు.

## పునాదులు, గోడలకే పరిమితం

● జగనన్న కాలనీల్లో పూర్తికాని ఇళ్లు ● ముళ్ల కంపలతో దర్శనమిస్తున్న లేఅవుట్లు


వలేటివారిపాలెంలో పిల్లర్లకే పరిమితమైన గృహాలు

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా ముళ్ల కంపలు, మొండి గోడలు, పిల్లర్ల ఇనుపచువ్వలే దర్శనమిస్తున్నాయి. మండలంలోని అంకభూపాలపురం మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఇళ్లు పూర్తి కాకుండానే వివిధ దశలో నిర్మాణాలు నిలిచిపోయాయి. అప్పటి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందించే ఆర్థిక సహాయం సరిపోకపోవడం, కట్టిన వాటికి బిల్లులు సక్రమంగా రాకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేక పోయారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేసింది. గృహ నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం అందించే ఈ మొత్తం ఏ మాత్రం చాలకపోవడంతో అనేక మంది ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. కొంత మంది పునాదులు వేసి వదిలేశారు మరికొందరు గోడలు కట్టారు. ఇంకొందరు శ్లాబు వేసి వదిలేశారు. మొత్తం మీద ఎక్కువ మంది ఇంటి నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. దీంతో ఇళ్లతో కళకళలాడాల్సిన కాలనీలు ముళ్ల చెట్లు, పుట్టలతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. అంతేకాక చాలా ఇళ్ల గోడలు నెర్రెలు బారాయి. మండలలోని 21 గ్రామ పంచాయతీల్లోని 28 గ్రామాల్లో జగనన్న లేఅవుట్‌ల్లో 1348 ప్లాట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. వాటిలో 630 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 25 ఇళ్లు మాత్రమే పూర్తయ్యా యి. అవి కూడా అంకభూపాలపురంలో 19, చిన్నఅమ్మపాలెంలో 2, కాకర్లవారిపాలెంలో 2, శామీరపాలెం ఎస్టీ కాలనీలో ఒక ఇల్లు, కళవళ్లలో ఒక ఇల్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు పిల్లర్లు, మొండి గోడలకే పరిమితమయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో అసలు ఇళ్లను ప్రారంభించనేలేదు.

**ఇళ్లు కట్టుకుంటే బిల్లులు ఇస్తాం**

గత ప్రభుత్వంలో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. పునాదులు, గోడలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం అలాంటివారు ఇళ్లు కట్టుకుంటే బిల్లులు చెల్లిస్తాం. గతంలో నిలిచిపోయిన ఇళ్లకు రూ 1.80 లక్షలతోపాటు ఎస్సీ బీసీలకు అదనంగా మరో రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలను ఈ ప్రభుత్వం అందిస్తోంది. లబ్ధి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నాగరాజు, హౌసింగ్ ఏఈ

## ప్రహరీగోడ కూల్చివేత : విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్ ముందున్న ప్రహరీగోడను హేవే నిర్మాణ పనుల్లో భాగంగా కూల్చివేశారు. దాన్ని కూల్చివేసి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ నిర్మించలేదు. దీంతో స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శింగరాయికొండ నుంచి మాలకొండ వరకు చేపట్టిన నేషనల్‌హైవేలో ఈ నాలుగు నెలల్లో జరిగిన ప్రమాదాల్లో 19 మందికి పైగానే మృత్యువాత పడ్డారు పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. అయ్యవారిపల్లె బస్టాండు సెంటరు హైవేలో ఇద్దరు మృతి చెందారు. అలాంటిది ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులకు ఏ క్షణంలోనైనా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పాటశాల విరామ సమయంలో ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులు ఆదమరిచి హైవే రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో వేగంగా వెళ్తున్న వాహనాల నుంచి ప్రమాదాల ముప్పు ఉంది గతంలో పాఠశాలకు ప్రహరీగోడ, గేట్ ఉండేది. అప్పుడు టీచర్లు గేట్‌కు తాళం వేసేవారు. విద్యార్థులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదు. అంతేకాకుండా పాఠశాల తూర్పు వైపున ఉన్న ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. పాఠశాల ఎదురుగా ప్రహరీగోడ లేకపోవడంతో హైవేపై వేగంగా వెళ్తున్న వాహనాలు పాఠశాలలోకి దూసుకపోయి హోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా అటు హైవే అధికారులు కానీ, ఇటు విద్యాశాఖ అధికారులు కానీ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీగోడను నిర్మించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

**ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు!**

నేషనల్‌హైవే పనులు పూర్తికాగానే ప్రహరీగోడ నిర్మిస్తామన్నారు వాళ్లు చెప్పి కూడ ఏడాదైంది. ఎప్పుడు అడిగినా అదిగో... ఇదిగో... అంటున్నారు. ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్న సంగతి వాస్తవమే. పాఠశాలకు తూర్పు వైపున ఉన్న ప్రహరీగోడకు ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు పంపించాం.

- మల్లికార్జునరావు, ఎంఈవో-2

## న్యూస్ బాక్స్

### రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వలేటవారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : పచ్చిరొట్టె విత్తనాలయిన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో హేయంత్ భరత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ క్వింటా రూ. 12,300, సబ్సిడీపోను రైతు చెల్లించాల్సింది రూ. 6,150లని, జనుములు క్వింటా రూ. 10,900, సబ్సిడీపోను రూ.5450, పిల్లిపెసర క్వింటా రూ. 18 వేలు, సబ్సిడీ పోగా రూ.9 వేలని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, దరఖాస్తు పత్రం, మొబైల్ ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలని తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే బుర్రా జన్మదిన వేడుకలు

లింగసముద్రం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ జన్మదిన వేడుకలను గురువారం వైసీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. లింగసముద్రంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.అలాగే పులిహోర పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ షఫీ, చీమల శ్రీనివాసులు, జీ. చిన చెంచురామయ్య, వంటేల శ్రీనివాసులు, మందా కొండయ్య, మట్లే వేణుగోపాల్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కొండాపురం, మే15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇళ్ల స్థలంలేని వారికి ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల స్థలం లేని వ్యక్తులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తదితర వివరాలతో స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు.

### గడ్డివామి దగ్ధం

దగదర్తి (బిట్రగుంట), మే 15 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం ఉలవపాళ్ల పంచాయతీ చినసంఘానికి చెందిన చలంచర్ల ప్రభుదాస్‌కు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు, బుధవారం రాత్రి 9.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఎకరాల గడ్డివామి తగులపెట్టడంతో పెద్ద మంటలు చెలరేగాయని తెలిపారు. కూలిపనులతోపటు పశువుల పాడితో అప్పులు తీర్చుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నానని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

## రైల్వే కేబుల్‌లైను ఏర్పాటుతో ఇబ్బందులే..!


రైల్వే కేబుల్ లైను ఏర్పాటు కోసం కాలువ తవ్వుతున్న కూలీలు

బిట్రగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): పురాతన చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో రైల్వే కేబుల్ లైన్ వేస్తే భవిషత్తులో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. బోగోలు కుమ్మరవీధి రైల్వే ఎల్సీ గేట్ 143 వద్ద నుంచి చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రైల్వే కేబుల్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. స్వామివారి ఆలయానికే కాకుండా మంచినీటిబావికి, గంగమ్మగుడికి వెళ్లే ప్రధానరోడ్డు ఇదే కావడంతో కేబుల్ లైన్ వేస్తే సీసీ రోడ్డు ఏర్పాటుకు ఇబ్బందికరంగా మారుతుందని అంటున్నారు. అంతేకాక గామస్థులు కర్మ, క్రతువులు చేసుకునేందుకు వెళ్లే మార్గం కూడా ఇదే కాబట్టి నిత్యం జనసంచారం ఉంటుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు తూర్పు వైపున ఇదివరకు ఏర్పాటు చేసిన కేబుల్, పైప్‌లైన్లతో పాటు ప్రస్తుతం వేస్తున్న సిగ్నల్ కేబుల్‌లైను ఏర్పాటు చేస్తే మంచిదని వారంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్థానికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆలోచించాలంటున్నారు.



చక్రత్తాళ్వారుతో తీర్థవాది ఉత్సవానికి కోనేర్ల వద్దకు వెళ్తున్న అర్చక బృందం, భక్తులు

## వైభవంగా తీర్థవాది

**నేటితో బ్రహ్మోత్సవాలు పూర్తి**

వేదగిరి క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్స వాల్లో గురువారం తీర్థవాది ఉత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, చక్రత్తా ళ్వారును ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రా లతో ఊరేగిం పుగా ఏడు కోనేళ్ల వద్దకు తీసు కెళ్లారు. అక్కడ స్నపనం అనంతరం చక్రస్నానం ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజావరోహణ గావించారు. ఈ కార్యక్ర మాలలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

## కందుకూరులో రోడ్డెక్కిన పొగాకు రైతులు

• గిట్టుబాటు ధర లేదంటూ రాస్తారోకో



కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యాపారులు రోజురోజుకి ధరలు దిగజారుస్తున్నారంటూ కందుకూరులో రైతులు ఆందోళన బాట పట్టారు. గురువారం వేలం ప్రక్రియ ప్రారం భమయ్యాక ధరలు దారుణంగా తగ్గిపోతున్నాయని గుర్తించిన రైతులు వేలంను నిలిపివేసి వేలం కేంద్రం బయట రోడ్డుపై బైఠాయించారు. దూబగుంట సమీపంలో ఉన్న కందుకూరు-1 వేలం కేంద్రంలో ఆందోళన చేపట్టిన రైతులు కం దుకూరు - కనిగిరి ప్రధాన రహదారికి ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా చెన్నిపాడు, బాలిరెడ్డిపాలెం రైతులు మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన పొగాకుకు కూడా కిలోకు రూ.220 ధర ఇస్తున్నారని, మొన్నటివరకు రూ. 250 వరకు చెల్లించిన వ్యాపారులు ఒక్కసారిగా ధరల్లో కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశా రు. వేలం ప్రారంభించిన సమయంలో నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర రూ.280 గా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు కొద్దిరోజులు గడిచాక అతి కొద్ది బేళ్లకు మాత్రమే ఆ ధర చూపిస్తూ అత్యధిక శాతం నాణ్యమైన బేళ్లకు రూ.250లకే సొంతం చేసుకుంటు న్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఆ ధర కూడా లేకుండా దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల తీరులో మార్పు వచ్చి గిట్టు బాటు ధరలు ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు, బోర్డు అధికారులు రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.



# 4 నెలలు.. 100 కేసులు!





డెంగ్యూ వ్యాధి జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. గత మూడేళ్లుగా డెంగ్యూ కేసుల నమోదు ప్రజలను కలవరపెడుతోంది. మరీ ముఖ్యంగా గడిచిన నాలుగు నెలలుగా ఏకంగా 100 కేసులకుపైగా అధికారికంగా నమోదు కావడం వ్యాధి తీవ్రతకు అద్దం పడు తోంది. వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టు కుని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండా లని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నా డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగ్యూకు సరైన వైద్యం అందక పోవటంతో పేదలు సైతం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటికే కొంత మంది మరణించగా పలువురు చికిత్స కోసం చెన్నై వంటి నగరాలకు వెళుతున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న డెంగ్యూ వ్యాధి
- నెల్లూరు నగరంలోనే ఎక్కువ
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాపాయమే !
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినం

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. నెల్లూరు నగరంలోనే ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదైనట్లు సమాచారం. కలువాయి మండలం, నెల్లూరు రూరల్, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, బోగోలు, కలిగిరి, కావలిరూరల్, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు తదితర మండలాల్లో ఇప్పటికే డెంగ్యూ జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ జ్వరంగా భావించి చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు ఆఖరుకు డెంగ్యూ వ్యాధిగా నిర్ధారణ కావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం డెంగ్యూ వ్యాధిని ర్యాపిడ్ పరీక్ష ద్వారా నిర్ధారించి వైద్య చికిత్సలు అందించాలి. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ పరీక్షలో గుర్తించిన డెంగ్యూను పరిగణలోకి తీసుకోమంటూ తేల్చి చెబుతోంది. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ఎలీషా పరీక్ష తప్పనిసరి అంటోంది. ఈ పరీక్ష కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నా ఆ ఫలితాలను కూడా పరిగణలోకి తీసుకోమంటూ, కేవలం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రభుత్వం ఆసుపత్రుల్లో నిర్వహించే పరీక్షలకే ప్రామాణికమని వాదిస్తోంది. దీంతో వైద్యశాఖ తీరుపై వైద్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవు తోంది. మరోవైపు ఎలీషా పరీక్షలు చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం.

### గట్టి చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కేసుల నమోదు ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి నీటి నిల్వలు లేకుండా, దోమలను లార్వా దశలోనూ నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం వ్యాధి గ్రస్తులకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- హుస్సేనమ్మ, డెంగ్యూ నివారణ అధికారి

**గత మూడేళ్లలో డెంగ్యూ కేసులు ఇలా...**

| సంవత్సరం | ప్రభుత్వం గుర్తించినవి | ప్రైవేట్ ఆసుపత్రుల్లో... |
|---|---|---|
| 2021 | 26 | 125 |
| 2022 | 148 | 210 |
| 2023 | 139 | 250 |
| 2024 | 130 | 310 |
| 2025 | 16 | 100 |

(ఏప్రిల్ వరకు)

# ఇదేంది సారూ..!

- వివాదాస్పదంగా ఇరిగేషన్ అధికారుల తీరు
- గత ప్రభుత్వంలోని వర్కులపై విజిలెన్స్ విచారణ
- పనులు చేయకనే బిల్లులు పెట్టుకున్నారని ఆరోపణలు
- ఇప్పుడు బిల్లుల కోసం హైకోర్టుకెళ్లిన వైసీపీ నేతలు
- కౌంటర్ వేయకుండా జిమ్మిక్కులు చేస్తున్న అధికారులు
- వారికి బిల్లులు ఇప్పించేందుకు ప్రయత్నాలు?

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులకు ఇరిగేషన్ శాఖ ఒక కల్పతరువుగా మారింది. ఎక్కడైనా ఎంతో కొంత తక్కువ పనులు చేసి ఎక్కువ బిల్లులు పెట్టుకోవడం చూశారు గానీ ఇరిగేషన్ శాఖలో మాత్రం అసలు పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకునే సంస్కృతికి బీజం పడింది. ప్రధానంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల్లో భారీ అక్రమాలు జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. 2022లో ఏకంగా రూ.232 కోట్ల మేర ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) కింద అనుమతులు ఇచ్చారు. వీటిలో చాలా పనులు 2019లోనే చేసినవి కావడం గమనార్హం. ఆ తర్వాత 2023లో ఓఅండ్‌ఎం వర్కులను మంజూరు చేయించి వాటిని ప్యాకేజీలుగా మార్చారు. ఒక్కో ప్యాకేజీలో పదుల సంఖ్యలో వర్కులు ఉన్నాయి. దీంతో ఏ వర్కు మంజూరైంది? ఏ వర్కు పూర్తి చేశారు? అన్న విషయాలు రైతులకు తెలియదు. అలానే కాంట్రాక్టర్ల మెయింటెన్స్ పీరియడ్‌ను కూడా తగ్గించేశారు. ఇక కొన్ని సీజన్లలో కాలువల్లో నీరు పారుతున్న సమయంలో ఓఅండ్‌ఎం పనులు జరిగినట్లు ఎంబుక్‌లు రికార్డు చేశారు. ఇలా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఇరిగేషన్ శాఖలో అనేక అవకతవకలు జరిగాయి. అప్పట్లోనే ప్రతిపక్ష పార్టీగా తెలుగుదేశం నేతలు ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. కానీ నాడు ఎవరూ పట్టించుకోలేదు.



### • విజిలెన్స్ విచారణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వంలోని జరిగిన అక్రమాలపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. నాడు పనులు చేయకుండానే బిల్లులు పెట్టిన అనేక వర్కులను బట్టబయలు చేశారు. వీటిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో జరిగిన ఓఅండ్‌ఎం, ఎఫ్‌డీఆర్ వంటి అనేక రకాల వర్కులపై విజిలెన్స్‌కు ఆదేశాలు వచ్చాయి. కొన్ని నెలల క్రితమే ఇరిగేషన్ శాఖ కార్యాలయాల నుంచి ఈ వర్కులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అక్రమాలు బయటపడినట్లు తెలుస్తోంది. కాగా విజిలెన్స్ విచారణ పెండింగ్ ఉండగా సదరు వర్కులకు సంబంధించి బిల్లులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. పనులు చేసినట్లు చెబుతున్న వ్యక్తులు కోర్టుకెళ్లినా.. ఇరిగేషన్ అధికారులు ఇందుకుగానూ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. విజిలెన్స్ విచారణ పెండింగ్ ఉంది కాబట్టి అది పూర్తికాగానే ఆ నివేదిక ఆధారంగా బిల్లులు చెల్లిస్తామని ఇరిగేషన్ అధికారులు కోర్టుకు తెలియజేయాల్సి ఉంటుంది. అప్పుడే వాస్తవాలు కోర్టు దృష్టికి వెళతాయి. కానీ జిల్లాలోని కొందరు అధికారులు ఈ పని చేయడం లేదు. విజిలెన్స్ విచారణ జరుగుతున్న విషయాన్ని హైకోర్టుకు తెలియజేయడం లేదు. దీంతో అక్కడి నుంచి బిల్లులు ఎందుకు నిలుపుదల చేస్తారంటూ ప్రశ్నలు వస్తున్నా సమాధానం ఉండడం లేదు. ఫలితంగా బిల్లులు చెల్లించాలని ఆదేశాలు అందుతున్నాయి.

### సీరియస్‌గా తీసుకుంటున్నాం

విజిలెన్స్ విచారణ జరుగుతున్న వర్కులకు సంబంధించి కొందరు బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే మా అధికారులు కొందరు సరైన కౌంటర్ వేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నాం. విజిలెన్స్ విచారణ జరుగుతున్న విషయాన్ని కోర్టుకు కౌంటర్ రూపంలో తెలియజేస్తాం.

- దేశానాయక్, ఇరిగేషన్ ఎస్‌ఈ

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీజనల్ వ్యాధులపై దృష్టిపెట్టి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో వైద్యాధికారుల సమక్షంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా డెంగ్యూ కేసులు నమోదైతే వెంటనే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలతో పాటు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో డయేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా డెంగ్యూ నివారణ అధికారి హుస్సేనమ్మ, ఎన్‌హెచ్‌ఎం అధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ బ్రహ్మనాయుడు, మలేరియా అదనపు అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ దినోత్సవ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

## ఇంటర్ సప్లిమెంటరీకి 478 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం మ్యాథ్స్- 1బీ, 2బీ, జువాలజీ-1, 2, హిస్టరీ-1, 2 పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 478 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్స రం పరీక్షలకు 12,240 మంది హాజరు కావాల్సి ఉండగా 11,809 మంది హాజరుకాగా 431 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1055 మంది హాజరు కావాల్సి ఉండగా 1008 మంది హాజ రుకాగా 47 మంది గైర్హాజర య్యారు. ఆర్‌ఐవో టీ వరప్రసాద రావు 18 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 8, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 కలిపి మొత్తం 53 కేంద్రాలను పరిశీలించారు.

## 21న పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ నెల్లూరు రీజియన్, జోన్-3 పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాల లీజుకు సంబంధించి అవగాహన సదస్సు ఈ నెల 21వ తేదీన జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి మురళీబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండుపైన మొదటి అంతస్థు లోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ సదస్సు ఉదయం 11 గంటలకు జరుగుంద న్నారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : 'అందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇంటి స్థలాల కోసం పేదలు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల స్థలం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు పొందిన వారికి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, పట్టణ ప్రాంతాలలో టిడ్కో లేదా యూఎల్‌బీ ఇళ్లు మంజూరు చేస్తాయని తెలిపారు. ఒకసారి స్థలం పొందిన వారు తిరిగి పొందకుండా ఆధార్, రేషన్ కార్డు స్థలానికి లింకు చేస్తారని అన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలలో 1,221 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాలలో 417 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర చెస్ విజేత శ్రీరామ్ చౌదరి

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన శ్రీరామ్ చౌదరి రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజేతగా నిలిచినందుకు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ అభినందించారు. జిల్లా చెస్ అసోసియేషన్, చిల్డ్రన్స్ పార్కులోని కురుక్షేత్ర చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముత్తుకూరు అదానీ పాఠశాలలో 7వతరగతి చదువుతున్న ఉన్నం శ్రీరామ్ చౌదరి కావలిలో జరిగిన రాష్ట్ర చెస్ పోటీల్లో అండర్-13 విభాగంలో చాంపియన్‌గా నిలిచాడన్నారు. రేటింగ్ ప్లేయర్స్‌తో పోటీపడి విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు జే భరత్‌కుమార్, ఎస్ వెంకటేష్, తల్లిదండ్రులు విజయలక్ష్మి, కిరణ్ చౌదరి, క్రీడాకారులు పాల్గొన్నారు.





క్రీడాకారుడిని అభినందిస్తున్న రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి సుమన్

## అమృత్ పైలాన్ ధ్వంసం కేసులో పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు

కావలి, మే15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అమృత్ పథకం పైలాన్ ను ధ్వంసం చేసిన కేసులో అరెస్ట్ అయి, సబ్‌జైలులో ఉన్న నలు గురు నిందితులను గురువారం పోలీసులు తమ కస్టడీకి తీసుకు న్నారు. ఈ కేసులో 12 మంది నిందితులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో జర్నలిస్టులు, యూట్యూబర్లు కుర్రు శ్రీనివాసరావు, కేదారి కొండయ్య, బీవీ లక్ష్మీనారాయణ, టీ. ప్రసాద్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు కోర్టు ద్వారా వారిని రెండు రోజులు కస్టడీకి తీసుకు న్నారు. గురువారం నలుగురిని పోలీసులు విచారించారు. శుక్రవారం కూడా విచారణ చేపట్టను న్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారో.. వారందరి వివరాలు బయటకు వస్తాయని వైసీపీ నేతలు భయం దోళన చెందుతున్నారు. సుమారు 30 మంది వరకు ఉండవచ్చనే ప్రచారం జరుగుతుండడంతో ఈ కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న వారంతా ఎక్కడ తమ పేర్లు బయటకు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

## ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి కోనా రవి కుమార్(36)మృతి చెందా డు. ఈ సంఘటన కావలి మండలం తుమ్మలపెంట సమీపంలో గురువారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు, మండలం లోని కొత్తసత్రానికి చెందిన రవికుమార్ ఆటోలో కావలి నుంచి గ్రామానికి వెళ్తూ జారి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద వంతెన నిర్మాణాలకు నిధులిస్తాం!

- డిసెంబరు కల్లా యూడీఎస్, తాగునీటి పనుల పూర్తి
- రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడి
- 26 డివిజన్లలో 339 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

నెల్లూరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద వంతెన నిర్మాణాలకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం ఉదయం నెల్లూరురూరల్ పరిధిలోని 26 డివిజన్లలో రూ.41 కోట్లతో పూర్తి చేసిన 339 అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభించారు. కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డుకాలనీలో పలు అభివృద్ధి పనులను మంత్రితోపాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరురూరల్లో రూ.231 కోట్లతో 816 అభివృద్ధి పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో మరెన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయో అర్థమవుతుందని చెప్పారు. గత ప్రభుత్వం తమపై కోపంతో నెల్లూరులో 90 శాతం పూర్తయిన యూజీడీ, తాగునీటి పనులు ఆపేసిందని వాటిని డిసెంబరుకు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డిని మిగిలిన ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకుని ఇదే తరహాలో పనులు చేయించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కేరాఫ్ అన్నారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపించారని తెలిపారు.



అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న మంత్రి నారాయణ

### • సిందూర్ అమరులకు అంకితం

పాకిస్థాన్‌పై పోరులో భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో అమరులకు ఈ అభివృద్ధి పనులన్నీ అంకితం చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు నెల్లూరురూరల్లో చేసింది గోరంతైతే చేయాల్సింది కొండంత ఉందన్నారు. పొట్టేపాళెం, ములుముడిల వద్ద వంతెనలు, బీసీభవన్, జగ్జీవన్‌రాం భవన్‌లకు నిధులు సమకూర్చాలని కోరారు. కాగా, 35వ డివిజన్ లేక్వ్యూ కాలనీ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్, ఎంహెచ్‌వో చైతన్య, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ అరవ శాంతి, నాయకులు శ్రీను, రాఘవేంద్ర పాల్గొన్నారు.



చలంచర్ల చెరువులో నరికేసిన జామాయిల్ చెట్లు

## చలంచర్ల చెరువులో కలప దొంగలు

- రెండు ట్రక్కుల జామాయిల్ కర్ర తరలింపు
- టీడీపీ సీనియర్ నేత నిర్వాహకమన్న గ్రామస్థులు

కావలి రూరల్, మే15(ఆధ్రజ్యోతి): మండలంలోని చలంచర్ల చెరువులో కలప దొంగలు పడ్డారు. ట్రాక్టర్‌తో రెండు ట్రక్కుల జామాయిల్ కర్రను దొంగిలించుకు పోయినట్లు గ్రామస్థులు తెలిపారు. జామాయిల్ కర్రకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో చెరువులో ఉన్న జామాయిల్‌పై అధికారపార్టీకి చెందిన సీనియర్ నాయకుడి కన్ను పడింది. ఇది ఆయన నిర్వాహకమేనని గ్రామస్థులు గుర్తించారు. చెరువు అంచున గుంట కట్టకు చుట్టూ ఉన్న సుమారు 15 టన్నుల జామాయిల్ కర్రను తరలించి సుమారు రూ. 50వేల వరకు సొమ్ముచేసుకున్నట్లు వారు తెలిపారు. చెరువులో రూ. లక్షల విలువ చేసే కర్రతుమ్మ చెట్లను, చెరువు కట్టపై ఉండే చిల్లకర్ర చెట్లను నరకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. జామాయిల్ కర్రను నరికి సొమ్ము చేసుకున్న నేత నుంచి నగదు రికవరీ చేయాలని వారు కోరుతున్నారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

• రూ. 88 వేల నగదు, 5 బైకుల స్వాధీనం

ఏఎస్ పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 88680 నగదు, 5 బైకులు, 6 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. గురువారం చిరమన సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలసి దాడిచేసి అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉంగరం సంగతి తెలుస్తుందని ఊపిరి తీసుకున్నాడు

నెల్లూరు రూరల్, మే 15,(ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తన కూతురు వద్ద బంగారు ఉంగరం తీసుకున్న విషయం ఇంట్లో తెలిసిపోతుందేమోనన్న ఆందోళనతో బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. నవలాకులతోట మంగళదిబ్బ వద్ద నివాస ముంటున్న పొదిలి శ్రీనివాసులు (39)కు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. మద్యానికి బానిసైన అతను ఒక కుమార్తె చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని అమ్మి దాంతో వచ్చిన నగదుతో కొన్ని రోజులుగా మద్యం తాగుతున్నాడు. ఇంట్లో నగదు అడగకుండా రోజూ మద్యం ఎలా తాగుతున్నాడని అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఆ విషయం ప్రశ్నిస్తే ఉంగరం విషయం తెలిసిపోతుందని ఆందోళనకు గురైన శ్రీనివాసులు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకున్నాడు. కొంత సమయానికి గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన నెల్లూరులోని హస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



పొదిలి శ్రీనివాసులు మృతదేహం